

జిల్లాలో నాలుగు రోజులు వర్షాలు

రాజమహేంద్రవరం సిటీ, మే 17 : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతో పాటు పలు జిల్లాల్లో నాలుగు రోజుల పాటు తేలిక పాటి జల్లుల నుంచి మోస్తరు వర్షాలు పడతాయని రాష్ట్ర విపత్తుల సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ తెలి పారు.ఈ మేరకు జిల్లా కలెక్టరేట్ నుంచి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 18న శనివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలిక పాటి జల్లుల నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు.ఈ నెల 19న కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. 20న కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, ఏలూరు జిల్లాల్లో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. వర్షాలు పడే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పంట పొలాల్లో పనిచేసే రైతులు, వ్యవసాయ కూలీలు ,పశువులు కాపరులు చెట్ల కింద ,బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదని సూచించారు.

రాజమహేంద్రవరంలో చిరుజల్లులు

రాజమహేంద్రవరం సిటీ, మే 17: రాజమహేంద్రవరంలో చెదురుమదరు జల్లులతో కూడిన వాన పడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ముసురుపట్టి తుపర్లుగా వాన పడింది. మబ్బుగా ఉండడంతో భారీ వాన పడుతుందని ప్రజలు అనుకున్నారు. కానీ జల్లులుగానే వర్షం పడడంతో కాస్త సేద దీరారు. మార్కెట్‌కు వచ్చిన వారు త్వరగా పనులు ముగించుకుని చిన్న పాటి వానలో తడుస్తూనే ఇళ్ళకు చేరుకున్నారు. మొన్నటి వరకు 40 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతతో మండిపోయిన నగరం ముసురుపట్టి కురిసిన వానతో పూర్తిగా చల్లబడింది. ఆకాశం మబ్బుగా ఉన్నా.. ఉక్కబోత తగ్గకపోవడంతో కాస్త అలసటకు గురయ్యారు. గుడ్డిలో మెల్ల అన్నట్టు భానుడు ఉగ్రరూపం చూపక పోవడంతో జనం రోడ్లపైకి వచ్చారు..

బీపీని అదుపులో పెట్టండి

డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం రూరల్, మే 17 : రక్తపోటును అదుపులో పెట్టుకుంటే ఎక్కువ కాలం జీవించవచ్చని డీఎంహెచ్‌వో వెంకటేశ్వరావు అన్నారు. బొమ్మూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రపంచ రక్తపోటు దినంలో ఆయన మాట్లాడారు. మీ రక్తపోటును ఖచ్చితంగా కొలవండి, అదుపులో పెట్టండి, ఎక్కువ కాలం జీవించండి అన్న సందేశం ఇచ్చారు.జిల్లాలో వివిధ ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు రక్తపోటుపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. జిల్లా ఎపిడమిస్ట్ సుధీర్‌బాబు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 1,79,642 మందిని పరీక్షించామన్నారు. వారిలో 30 ఏళ్ల పైబడిన వారు 1,69,017 మంది ఉండగా 83 శాతం స్క్రీనింగ్ జరిగి 1,15,715 మందికి హైపర్ టెన్షన్ ఉన్నట్టు నిర్ధారించి 93,984 మందికి ఉచితంగా ట్రీట్‌మెంట్ ఇచ్చామన్నారు. ఈ నెల చివరిలో 3వ ఎన్‌సీడీ స్క్రీనింగ్ నిర్వహిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్‌సీడీ అధికారి డాక్టర్ హరిశ్చంద్రప్రసాద్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ మౌనిక, డాక్టర్ సత్యకుమార్ కుమార్ స్వామి, సూపర్‌వైజర్లు జాన్సన్ రాజు, రాజు, ఆలీబేగ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పారితోషికాల్లో వ్యత్యాసాల సవరణ

రాజమహేంద్రవరం సిటీ, మే 17 : సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వహించిన సిబ్బంది పారితోషికాల్లో వ్యత్యాసాలను సవరించారని ఏపీ ఎన్జీవో సంఘం నాయకులు తెలిపారు. పారితోషికాల్లో వ్యత్యాసాలపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ మాధవీలతకు వినతిపత్రంఅందజేశామన్నారు.దీనిపై స్పందించిన ఆమె సమస్య పరిష్కరించారని తెలిపారు.ఈ మేరకు ఏడు నియోజకవర్గాల ఆర్‌వోలకు సమస్య పరిష్కరించా లని ఆదేశాలు జారీ చేశారని సంఘ రాష్ట్ర కార్యదర్శి వేణు మాధవ్,నగర అధ్యక్ష కార్యదర్శులు సుబ్బారావునా యుడు,ప్రవీణ్‌కుమార్,ఉపాధ్యక్షుడు మాధవరావు తెలిపారు.

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సమీక్ష

రాజమహేంద్రవరం సిటీ, మే 17: నన్నయ వర్శిటీ పరిధిలో 144 సెక్షన్‌అమల్లో ఉందని.. కట్టుదిట్టమైన భద్రతలో ఈవీఎంలు ,వీవీ ప్యాట్‌లు ఉన్నాయని జిల్లా ఎన్నిల అధికారి, కలెక్టర్ డాక్టర్ కే మాధవీలత, జిల్లా ఎస్పీ జగదీష్ తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్‌మీనా శుక్రవారం జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈవీఎంలు ,వీవీ ప్యాట్స్‌ల సురక్షితంగా నిల్వచేసిన విధానాన్ని వివరించారు. ఈ సమీక్షలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ తేజ్ భరత్, డీఆర్‌వో జి.నరసింహులు పాల్గొన్నారు.



అనధికార విద్యుత్ కనెక్షన్..

వైరు తగిలి వివాహిత మృతి

అనపర్తి, మే 17 : అక్రమంగా ఏర్పాటు చేసిన విద్యుత్ తీగ ఒక మహిళ ప్రాణాలను బలగొంది. ఎస్ఐ రామారావు, స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం. అనపర్తి మండలం కుతుకులూరులో కూటేశ్వర కాలనీ వద్ద ఇటీవల ప్రైవేటు వ్యక్తులు బస్టాండ్ నిర్మాణం చేపట్టారు. బస్టాండ్‌కు సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ నుంచి అనధికారికంగా వైరు ఏర్పాటు చేసుకున్నారు. అయితే ఆ వైరు తెగి సమీపంలోని ఆలయం వద్ద గల ఇనుప పెన్సింగ్‌పై పడింది. ఆ కాలనీలో నివాసం ఉండే మేడవరపు రామతారకం (55) శుక్రవారం ఇంటి నుంచి చెత్త పారబోసేందుకు వచ్చి అనుకోకుండా ఇనుప పెన్సింగ్‌పై చేయి వేసింది. దీంతో విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కడే మృతిచెందింది. సమాచారం అందుకున్న ఎస్ఐ రామారావు సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబం నుంచి ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేశారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు. ఇదంతా గ్రామంలో విద్యుత్‌శాఖ సిబ్బందికి తెలిసే జరిగిందని బాధ్యులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

అంతా ఆయనే.. చేశారు!



అంతా నేనే.. కర్త కర్మ క్రియ అంతా నేనే.. ఇదీ జగన్ నియంతృత్వ ధోరణి.. ఓటు కూడా అభ్యర్థిని చూసి వేయరు.. నన్ను చూసి వేయాలి.. ఇదీ జగన్ మాట.. ఆ నియంతృత్వమే కొంప ముంచినట్టు సమాచారం.. ఎందుకంటే ప్రజలు గత ఐదేళ్లుగా అనుకుంటున్నది ఒక్కటే.. ఒక్క ఛాన్స్ అంటే.. ఎందుకు ఎన్నుకున్నాంరా బాబూ అని.. ఈ ఎన్నికల్లో ఓటుతో ఆ మాటను నిజం చేసినట్టు ఎక్కడ చూసినా చర్చ సాగుతోంది.. జగనే టార్గెట్‌గా ఎన్నికలు జరగడంతో కూటమికి వంద శాతం విజయం ఖాయమని ప్రజలు చెబుతున్నారు.. వైసీపీలోనూ ఈ మేరకు చర్చ సాగడం గమనార్హం.. అభ్యర్థులు కూడా జగన్‌ని టార్గెట్ చేసి అంతా మీరే చేశారనేందుకు సిద్ధమవుతున్నారు..

ఓడిపోతే..ఆ పాపం జగన్‌దే..

- లెక్కల తక్కెడలో వైసీపీ అభ్యర్థులు
- ఓటమి పాలవుతారనే చర్చ
- కారణాలకు టార్గెట్ జగన్
- కూటమికి సైలెంట్ వేవ్
- ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ
- జూన్ 4 కోసం ఎదురుచూపు
- అభ్యర్థుల్లో తీవ్ర టెన్షన్

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

అయ్యబాబోయ్ భరించలేకపోతున్నాం.. 2024 ఎన్నికలకు ముందు జగన్ పాలనపై చాలా మంది నోట వినిపించిన మాట ఇది.. ఆ మాటనే నిజం చేశారనేది నమ్మకం.. వైసీపీ అధినేత జగనే టార్గెట్.. చివరకు వైసీపీ వర్గాల్లోనూ ఇదే చర్చ సాగడం గమనార్హం. సీఎం జగన్ వైఖరి, ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాల వల్ల ప్రజలు విసిగిపోయినట్టు అర్థం అవుతుంది. అందుకే కసికసిగా ఓట్లేసినట్టు ఓటర్లు బహిరంగంగానే చెబుతున్నారు. జగన్ గ్రాఫ్ అట్టర్ ప్లాప్ అయినట్టు ప్రచారం జరుగుతోంది. వైసీపీకి కొంత మేర ఓటు బ్యాంక్ ఉండడం వాస్తవమే. కానీ వ్యతిరేకత ఈ ఓటు బ్యాంక్ కంటే చాలా రెట్లు పెరిగింది. దీంతో వైసీపీ అభ్యర్థులు సొంత వ్యూహాలు వేసుకున్నారు. సొంత మేనిఫెస్టోలు పెట్టుకుని ప్రచారం చేసుకున్నారు. కొన్ని చోట్ల జగన్ పేరు కూడా ఎత్తకుండా జాగ్రత్త పడ్డారు. స్థానికంగా కులాలు,వర్గాలుగా విభజించి ప్రజలను ప్రలోభాలకు గురి చేసి ఏదో విధంగా గట్టెక్కాలని చేసిన ప్రయత్నాలన్నీ విఫలమనే చర్చ సాగుతోంది.

అందరిదీ ఒకటే మాట..

జిల్లాలో ఒక లోక్‌సభ, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్రులు 83 మంది పోటీపడ్డారు. అయితే కూటమి అభ్యర్థులు.. వైసీపీ అభ్యర్థుల మధ్యే ప్రధానంగా పోటీ నెలకొంది.యువత, మహిళలు, వృద్ధులు సమాజంలోని అనేక వర్గాలు జగన్ పోవాలి అనే నినాదంతోనే ఓట్లు వేసినట్టు చర్చ సాగుతోంది. అభివృద్ధిని పూర్తిగా గాలికొదిలేసి.. సంక్షేమాన్ని మాత్రమే పట్టుకుని వేళాడడంతో లబ్ధిదారుల్లో జగన్ మీద నమ్మకం పోయినట్టు చెబుతున్నారు. శాంతిభద్రతలు లేకపోవడం, అవినీతి పెరగడం వంటివన్నీ వైసీపీ కొంప ముంచే పరిస్థితుల్లోకి నెట్టాయి. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ ముప్పు తెచ్చింది. సర్వే రాళ్లపై జగన్ పేరు రాయించుకోవడం,బొమ్మ వేయించుకోవడం, ఇళ్ల పట్టాలు, ప్రజల సొంత భూమి పట్టాల మీద కూడా జగన్ బొమ్మ వేయించుకోవడం పెద్ద సమస్యనే తెచ్చిపెట్టిందని చెప్పవచ్చు. దీనికి తోడు ఉద్యోగ వర్గాల్లో ఏ సీఎంకు లేనంత వ్యతిరేకత వచ్చింది. దీంతో పోస్టల్ బ్యాలెట్ 85 శాతం వరకూ కూటమికే పడినట్టు సమాచారం. అంతే కాకుండా వైసీపీ మేనిఫెస్టో చప్పగా ఉండడం, పింఛన్ల సొమ్ము 2028 నుంచి రూ.250 వంతున పెంచుతానని చెప్పడంతో జనం అసహనాన్ని పెంచింది. మరో పక్క కూటమి తరపున చంద్రబాబు, పవన్ మేనిఫెస్టో ప్రజల హృదయాల్లోకి చొచ్చుకుపోయింది. పింఛన్లు ఏప్రిల్ నుంచే నెలకు రూ.4 వేల వంతున పెంచుతాననడం కూడా ప్లస్ అయింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఎంత మంది పిల్లల ఉన్నా అందరికీ తల్లికి వందనం, బీసీ రిజర్వేషన్లు పెంచుతాననడం, బీసీ రక్షణ చట్టం వం టివి బాగా ఆలోచింప చేశాయి. ఈ నేపథ్యంలో ఓటరి చూపు కూటమిపై మళ్లింది.. అభివృద్ధి చేసే నాయకుడినే ఎన్నుకుందామని మళ్లీ ఓటరు బాబు వైపు చూడడం ఆరంభించారు. ఇది తెలిసిన వైసీపీ అభ్యర్థులు ఓట్లను పెంచుకోవడం కోసం తెగతంటాలు పడ్డారు.అనేక సొంత వ్యూహాలు రచించుకుని ప్రచారం చేశారు. అయితే జగన్ మీద ఉన్న వ్యతిరేకత వల్ల వారి ప్రయత్నాలు ఎంతవరకూ ఫలిస్తాయో చూడాలి మరి. గతంలో పార్టీ పేరు చెప్పి ఓట్లు అడిగేవారు. ఈ సారి చాలా నియోజకవర్గాల్లో వైసీపీ అభ్యర్థులు తమ పేరే ఎక్కువగా చెప్పుకోవడం గమనార్హం. ఇలా ఈ సారి ఎన్నికలు కొత్త కోణాన్ని ఆవిష్కరించాయి.

జూన్ 4 వరకూ టెన్షన్

కౌంటింగ్‌కు మరో 20 రోజులు గడువు ఉంది. దీంతో అభ్యర్థుల్లో టెన్షన్ నెలకొంది. వివిధ రాజకీయ పార్టీలతో పాటు, టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిలో గెలుపు ధీమా వ్యక్తమవుతోంది. వారికి వచ్చిన సర్వే రిపోర్టులు, వారి సొంత అంచనాలు,నియోజకవర్గంలో పోలింగ్ బూత్‌లు, గ్రామాల వారీ కట్టిన లెక్కలు అన్నీ కూటమి గెలుపునే చూపిస్తున్నాయి. ఉద్యోగ, అధికార వర్గాల్లో కూటమి వైపే ఫలితాలు రానున్నట్టు ఒకటే చర్చ జరుగుతోంది.ఈ మేరకు పలువురు నాయకులు అభ్యర్థుల ఇళ్లకు వచ్చి అభినందనలు తెలుపుతున్నారు. కూటమికి చెందిన కొందరు రిలాక్స్ కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లడం గమనార్హం. వైసీపీ అభ్యర్థులు మాత్రం ప్రతి గ్రామంలోనూ ఎలా జరిగిందనే అంచనాలలో నిమగ్నమయ్యారు. ఇలా అందరూ జూన్ 4 కోసం ఎదురు చూస్తున్నారు. గెలుస్తామనే ధీమా వచ్చిన అభ్యర్థులు మెజార్టీ ఎంత అనే అంచనాలు వేస్తుంటే, టైట్‌గా ఉందని, ఓడిపోతామేమోననే భయం ఉన్న వారు ఏదో విధంగా కొన్ని ఓట్లు తమ కోటాలో వేసుకునే ప్రయత్నం చేస్తూ, బొటాబొటిగా గెలిచినా పర్వాలేదనే ఆలోచనతో ఉన్నారు.

జగన్ భయపడుతున్నాడు..



ఖాళీ అయిపోయే పార్టీని చూసి.. జగన్ రెడ్డి భయపడి లేనిది ఉన్నట్టుగా మాట్లాడుతున్నాడు.. అతను చెప్పేది పూర్తిగా సత్య దూరం.. ఏపీలో గెలిచేది కూటమే. గత ఐదేళ్లుగా ప్రజలు విసిగిపోయారు.జగన్ పాలనలో అన్నివర్గాలకు తీవ్ర అన్యాయం జరిగింది. ఓపికతో ఎన్నికలు ఎప్పుడు వస్తాయోనని ప్రజలు ఎదురుచూశారు. ఈ ఎన్నికల్లో కూటమిని సమర్థించారని.. విజయం మాదే. ఫలితాలు రావడమే తరువాయి. వైసీపీ కేడర్‌ను కాపాడుకోవడానికి జగన్ పచ్చి అబద్ధాలు ఆడుతున్నాడు. తొందరెందుకు ప్రజలు తీర్పు జూన్ 4న వెలువడుతుంది.

- ఆదిరెడ్డి అప్పారావు, మాజీ ఎమ్మెల్సీ



వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతోత్సవాల్లో భాగంగా ధవళేశ్వరం గ్రామంలో శుక్రవారం అమ్మవారిని రూ.6 లక్షల కరెన్సీ నోట్లతో ధనలక్ష్మిగా అలంకరించారు. ఈ మేరకు భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. శనివారం కన్యలతో పూజలు నిర్వహిస్తారన్నారు. - ధవళేశ్వరం

రాజానగరంలో ఏం జరిగింది!

బ్యాలెట్‌లో మొత్తంగా నలుగురు బత్తుల బలరామకృష్ణలు..



దివాన్‌చెరువు,/ రాజానగరం, మే 17 : ఓటమి పాలవుతామనే భయంతో వైసీపీ నాయకులు వేసిన ఎత్తులు అన్నీ ఇన్నీ కావు.. ఎన్నడూ లేనిది ఏకంగా ఒకే పేరుతో ఉన్న అభ్యర్థులను రంగంలోకి దించి ఓట్లు చీల్చాలనే కుయుక్తులకు తెరలేపారు. దీనికి రాజానగరం నియోజకవర్గం వేదికైంది.. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో రాజానగరం నియోజకవర్గం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఉమ్మడి అభ్యర్థిగా జనసేన తరపున బత్తుల బలరామకృష్ణ పోటీచేశారు.అయితే ఇదే పేరుతో ఇతర జిల్లాలకు చెందిన మరో ఇద్దరు అభ్యర్థులు అసెంబ్లీకి, ఒక అభ్యర్థి లోక్‌సభకు పోటీచేశారు.ఈ ముగ్గురిది మన జిల్లా కాదు.. ఎక్కడో రాయలసీమ తదితర ప్రాంతాల నుంచి తీసు కొచ్చినట్టు సమాచారం.ఈ ముగ్గురి పేర్లు బత్తుల బలరామకృష్ణే కావడం గమనార్హం. ఇలా రాజానగరం నియోజకవర్గం ఈవీఎం బ్యాలెట్‌లో నలుగురు బత్తుల బలరామకృష్ణలు పోటీపడ్డారు. అయితే కూటమి అభ్యర్థి బత్తులకు కేటాయించిన ఎన్నికల గుర్తు గాజుగ్లాసును పోలిన గుర్తులే మిగిలిన ఇద్దరు అభ్యర్థు లకు కేటాయించడం గమనార్హం. అంతే కాకుండా ఈ ముగ్గురు అభ్యర్థుల పేర్లు ఈవీఎంలలో వరుస క్రమంలో ఉండడంతో కొంత మంది ఓటర్లు అయోమయానికి గురైనట్టు సమాచారం.అయితే నియోజకవర్గంలో మాత్రం ఎవరికి అడిగినా గాజు గ్లాసుకే ఓటే శామని చెబుతున్నారు. ఓటింగ్‌లో జిల్లాలోనే రాజానగరం నియో జకవర్గం అగ్రస్థానంలో నిలిచింది.నియోజకవర్గంలో 2,16,491 మంది ఓటర్లకు 87.53 శాతం 1,89,505 మంది ఓటు హక్కు వినియో గించుకున్నారు. తాము చాలా ఎన్నికలు చూశామని..ఈ విధంగా ఓటర్లు ఓట్లు వేయడం అరుదు అని పలువురు విశ్లేష కులు అంటున్నారు. జూన్ నాల్గవ తేదీన వెలువడే ఫలితాల్లో తమ అభ్యర్థికే విజయం చేకూరుతుందన్న గట్టి విశ్వాసంతో కూటమి నేతలు ఉన్నారు.

పట్టుకుంటారా.. వదిలేస్తారా!?



- ఇసుక దొంగలపై అధికారుల శీతకన్ను
- తీపర్రు ర్యాంపులో గురువారం హడావుడి
- దొంగలను వదిలేసి..యంత్రాలు సీజ్
- శుక్రవారం గోదారి బాటనే తవ్వేసిన వైనం
- అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు

పెరవలి, మే 17: ఏంటో ఈ అధికారుల లీలా వినోదం.. జిల్లా కేంద్రంలో అధికారుల కళ్లెదుటే ఇసుక తవ్వేస్తున్నా ఎటువంటి దాడులూ లేవు..ఇప్పుడేమో హడావుడి చేస్తున్నారు. కళ్లెదుట రాజమహేంద్రవరంలో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు సాగుతున్నా కనిపించడంలేదు.. తీపర్రులో మాత్రం అధికారులు కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా హడావుడి చేస్తున్నారు. దొంగ అనుమతులు తెచ్చుకుని చాలా కాలంగా అక్రమ ఇసుక తవ్వకాలు జరిపి వందలాది కోట్లు దోచేసినా స్పందించని అధికారులు సుప్రీంకోర్టు మొట్టికాయలు వేయడంతో కదిలి వచ్చారు. అయితే తాము వస్తున్న సమాచారం లీక్ చేయడంతో ఇసుక దొంగలు తట్టా బుట్టా సర్దేసుకున్నారు. వచ్చిన అధికారులు అక్కడ ఎవరూ లేరంటూ కథలు అల్లారు. రెండు ఎక్స్‌కవేటర్లు, ఇసుక ఎగుమతికి వచ్చిన రెండు లారీలకు జరిమానా విధించి చేతులు దులుపుకున్నారు. వందల లారీలు ఇసుక, మట్టి తవ్వుకుపోయిన దొంగలు పారిపోయారని చెబుతున్నారు. పారిపోయిన దొంగలను పట్టుకుంటారో.. లేదో వేచి చూడాలి.

ఇసుక బాటకు గండి కొట్టిన దొంగలు..

ఇన్నాళ్ళుగా వందలాది లారీలు తోలుకుపోయిన ఇసుక బాటకు దొంగలు గండి కొట్టారు. గురువారం ఉదయం నుంచి రాత్రి ఒంటి గంట వరకు అధికారులు అక్కడే ఉన్నారు. తమకు నచ్చిన రీతిలో రిపోర్టులు రాసుకుని వెళ్లారు. అయితే అధికారులు ఇచ్చిన సూచనో.. దొంగలకు తట్టిన ఆలోచనో తెలియదు కానీ ఇసుక ర్యాంప్ బాటకు గండి కొట్టి గోదావరిలోకి ఎవరూ వెళ్లే వీలు లేకుండా చేసేశారు. దీంతో పాటు గోదావరి బ్యారేజీల నుంచి ఎక్కువ మొత్తంలో నీరు వదిలేలా చేసి తాము ఇంత వరకు అక్రమంగా తవ్విన గోతులు నీటితో నిండిపోయేలా చేశారు. దీంతో ఇంత వరకు ఎంత ఇసుకను అక్రమంగా తరలించారు.. కొలతలు వేసి నిర్ధారించేందుకు అధికారులకు అవకాశం లేకుండా పోయింది. నిన్న, మొన్నటి వరకు చుక్కనీరు లేకుండా ఇసుక మాత్రమే కనిపిస్తే ఇపుడు గోదావరికి వరద వచ్చిన పరిస్థితిలా మొత్తం నీటితో నిండిపోయి ఆనవాలు లేకుండా మారిపోయింది. దీనికి కారణం అధికారులు నిర్లక్ష్య వైఖరి అని స్థానికులు విమర్శిస్తున్నారు. గతం నుంచి పత్రికల్లోనూ సామాజిక మాధ్యమాల్లోనూ టీవీలలోనూ ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకోవాలంటూ ఎంతగా మొత్తుకున్నా చెవికెక్కని అధికారులు ఏదో దొంగలను పట్టేదాం అన్నంత సీరియస్‌గా గురువారం ర్యాంప్‌లకు చేరుకున్నారు. అక్కడ కనీసం ఒక పుస్తకాన్ని గాని, ఒక వ్యక్తిని గాని అదుపులోకి తీసుకోలేకపోయారు. దీనిపై అయా శాఖల అధికారులపై విమర్శలు వస్తున్నాయి.



గోదావరిలో ఇసుక చోరీ జరిగింది..

గోదావరిలో ఇసుకను ఒక చోట గుట్టగా పెట్టారు. చోరీ జరిగిందని తెలిసినపుడు అధికారులు ఏం చేయాలి..ఆ ఇసుక గుట్టలను స్వాధీనం చేసుకుని ఎర్ర జెండాలు పాతాలి. కాని తీపర్రు, ఉసులుమర్రు మధ్యలో నిడదవోలు నరసాపురం రోడ్డుకు ఆనుకుని పెద్ద ఇసుక గుట్టలు ఉన్నాయి. ఇదంతా గోదావరిలో అక్రమంగా తవ్విన ఇసుక.. ప్రస్తుతం గోదావరి నుంచి తవ్వుతున్నందు వల్ల ఇసుకను రేపు గోదావరికి వరదలు వచ్చిన అనంతరం అమ్ముకుందామనే ఉద్దేశంతో అక్రమ తవ్వకం దారులు నిల్వ ఉంచారు. అయితే ఈ విధంగా దొరికిన దొంగ సొత్తును అధికారులు స్వాధీనం చేసుకోకుండా తిరిగి వెళ్లిపోవడం అనుమానాలకు తావిచ్చింది. రాత్రి సమయంలో ఆ ఇసుక గుట్టలను కూడా ఇసుక దొంగలు తరలించుకుపోయేలా అధికారులు సహకరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.అధికారులు వెంటనే స్పందించి ఇసుక గుట్టలు స్వాధీనం చేసుకుని అక్రమ ఎగుమతులు జరగకుండా అడ్డుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఎవరు గెలిచినా మీదే గెలుపు

జిల్లా స్థాయి కూపన్ నెం. 6

పాఠకుని పూర్తి పేరు : ....

డోరు నెంబరు : .... వీధి పేరు : ....

గ్రామం/పట్టణం : .... మండలం : ....

జిల్లా : .... పోస్టల్ పిన్‌కోడ్ : .... ఫోన్ నెం. ....

తూర్పుగోదావరి ఉమ్మడి జిల్లాలోని ఒకొక్క అసెంబ్లీ స్థానంలో ఎవరు గెలుస్తారు అనేది, మీరు ఊహించిన అభ్యర్థి ఎదురుగా గడిలో టిక్ ✔ మార్క్ చేయండి.

నియోజకవర్గం పేరు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు
1. తుని				
2. జగ్గంపేట				
3. ప్రత్తిపాడు				
4. పెద్దాపురం				
5. పిఠాపురం				
6. కాకినాడ సిటీ				
7. కాకినాడ రూరల్				
8. అనపర్తి				
9. రాజానగరం				
10. రాజమండ్రి రూరల్				
11. రాజమండ్రి సిటీ				
12. రంపచోడవరం				
13. రామచంద్రపురం				
14. మండపేట				
15. కొత్తపేట				
16. పి. గన్నవరం				
17. రాజోలు				
18. అమలాపురం				
19. ముమ్మిడివరం				
మొత్తం :				

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

ఆంధ్రజ్యోతి కార్యాలయం : డోరు నెం. 114-2-485/2, దివాన్‌చెరువు టు వెలుగుబంద రోడ్, పాలచర్ల గ్రామ పంచాయితీ, రాజానగరం మండలం, రాజమండ్రి - 533102.




ఎస్టీయూ ఉద్యమ శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న సీపీఐ కార్యదర్శి రామకృష్ణ

ఉపాధ్యాయులే ప్రభుత్వం కళ్లు తెరిపించాలి!

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

రాజానగరం, మే 17: అపరిష్కృత సమస్యల సాధన కోసం ఉపాధ్యాయులే ప్రభుత్వం కళ్లు తెరిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. గైట్ కళాశాలలో రెండ్రోజులపాటు జరిగే రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర స్థాయి ఉద్యమ శిక్షణా తరగతులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రామకృష్ణ ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై ప్రసంగించారు. మన రాష్ట్రంలో కులానికో కార్పొరేషన్ ఏర్పాటుచేసి పదవులు పందారం చేసినా, ఆ పదవి పొందినవారు కారుకు పెద్ద బోర్డు తగిలించుకోవడం తప్ప ఎటువంటి ఉపయోగం లేదన్నారు. దీనిపై తాను ప్రశ్నించగా అలాగే అలా బోర్డు ఏర్పాటుచేస్తే టోల్‌గేట్ వద్ద టోల్ అడగరన్న సమాధానం వచ్చిందన్నారు. మోదీని ఇంటికి, వైసీపీని ఇడుపులపాయకు పంపాలన్నదే తమ నినాదమన్నారు. చంద్రబాబు సీఎం అయితే ఇంత దుర్మార్గంగా మాత్రం ఉండదని, ప్రజాస్వామ్యం పరిఢవిల్లకపోవచ్చుగానీ ఆయన ఇంటికి వెళ్లి కనీసం ప్రశ్నించే అవకాశం అయినా ఉంటుందని ఒక ఉపాధ్యాయుడు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయి శ్రీనివాస్ విద్యారంగం తాజా పరిస్థితులపై మాట్లాడుతూ ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రధానోపాధ్యాయులకు ఈవెంట్ మేనేజర్లుగా నైపుణ్యం ఇచ్చారంటూ ఛలోక్తి విసిరారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల దైనందిన కార్యక్రమం సెల్‌ఫోన్‌తోనే ప్రారంభమవుతోందన్నారు. విద్యానిలయాల్లో విద్యకు ప్రాధాన్యం లేకుండా అప్రధానమైన విషయాలకే ప్రాధాన్యమిస్తున్నారన్నారు. ప్రాథమిక పాఠశాలల్లోని కొన్ని తరగతులను విలీనం ద్వారా పల్లెబడులకు మంగళం పాడారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రఘునాథరెడ్డి, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు, ఉపాధ్యాయ వాణి ప్రధాన సంపాదకుడు జి.నాగేశ్వరరావు, సంఘ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శివప్రసాద్, ఉపాధ్యక్షుడు జాకబ్, ఆర్థిక కమిటీ సభ్యుడు ఈశ్వరరెడ్డి, తూర్పుగోదావరి, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డానియేల్‌బాబు, లక్ష్మణ, దొరబాబు, పల్లంరాజు, మోర్త శ్రీను, కాశీ విశ్వనాథ్, నాయకులు ఎస్‌జే త్రినాథ్‌బాబు, పి.సుబ్బరాజు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



నేటి నుంచి సత్యదేవుడి దివ్యకల్యాణోత్సవాలు

- తొలిరోజు పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెలుగా స్వామి, అమ్మవార్లు
- 19వ తేదీ రాత్రి దివ్యకల్యాణం • 24 రాత్రి శ్రీపుష్పయాగంతో ముగింపు
- వారం రోజులూ నిత్యం వివాహ వేడుకలు, కొండ దిగువ ఊరేగింపు
- ఈ ఏడాది ప్రత్యేక ఆకర్షణగా నూతన పెద్దరథంపై ఊరేగింపు


సత్యదేవుడి కల్యాణం (ఫైల్)

అన్నవరం, మే 17: రత్నగిరివాసుడైన సత్యదేవుడు, దేవేరి అనంతలక్ష్మి అమ్మవారిని పరిణయమాడే వేళ సమీపిస్తోంది. ప్రతిఏటా వైశాఖ శుద్ధ ఏకాదశి రోజున సత్యదేవుడి దివ్యకల్యాణం అంగరంగ వైభవంగా జరుగుతుండగా క్రోధి నామసంవత్సర కల్యాణోత్సవ వేడుకలు ఈసారి మే 18న ప్రారంభమై 24తో ముగియనున్నాయి. దీనికి దేవస్థానం అధికార యంత్రాంగం రూ.50 లక్షలను వెచ్చిస్తూ ఏర్పాట్లు పూర్తిచేసింది. ఆలయానికి రంగులు వేసి విద్యుద్దీపకాంతులతో దేదీప్యమానంగా తీర్చిదిద్దారు. శనివారం సాయంత్రం సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెగా భక్తులను అనుగ్రహిస్తారు. స్వామి, అమ్మవార్ల వివాహ కార్యక్రమానికి క్షేత్రపాలకులు సీతారాములు పెళ్లి పెద్దలుగా వ్యవహరిస్తారు. కల్యాణమహోత్సవాలు వారంరోజులు కొండపై పెండ్లి వేడుకలు, దిగువన వాహనసేవలు నిర్వహిస్తారు.

18న : వేకువజామున సుప్రభాతసేవ, చతుర్వేదపారాయణలు, సాయంత్రం 4 గంటలకు అనివేటి మండపంలో స్వామి, అమ్మవార్లను పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెగా అలంకరణ, రాత్రి 7 గంటలకు కళామందిరంలో ఎదుర్కోలు ఉత్సవం, రాత్రి 9 గంటలకు కొండదిగువన వెండి ఆంజనేయవాహనంపై సీతారాముల గ్రామోత్సవం జరుగుతుంది.

19న: సుప్రభాతసేవ, ఉదయం 9 గంటలకు అంకురార్పణ, ధ్వజారోహణం, కంకణధారణ, రాత్రి 7గంటలకు కొండ దిగువన వెండి గరుడవాహనంపై పెండ్లికొడుకైన సత్యదేవుడు, వెండి గజవాహనంపై అనంతలక్ష్మి అమ్మవారు వెండి పల్లకీలో సీతారాముల ఊరేగింపు, గ్రామోత్సవం ఉంటుంది.

20న: సుప్రభాతసేవ, చతుర్వేదపారాయణలు, సాయంత్రం 5 గంటలకు ప్రధాన ప్రవేశస్థాలిపాక హోమాలు, రాత్రి 7గంటలకు అరుంధతీ నక్షత్రదర్శనం, రాత్రి 9 గంటలకు కొండదిగువన రావణబ్రహ్మ వాహనంపై నవదంపతుల గ్రామోత్సవం.

21న: సుప్రభాతసేవ, చతుర్వేదపారాయణలు, మధ్యాహ్నం 2.30కి అనివేటి మండపంలో క్షేత్రపాలకుల సీతారాముల సమక్షంలో సరస్వతీపూజ, పండిత సదస్యం, వేదశాస్త్ర సభ, పండిత సత్కారం రాత్రి 9గంటలకు కొండ దిగువన పొన్నవాహనంపై నవదంపతులకు గ్రామోత్సవం.

22న: సుప్రభాతసేవ, చతుర్వేదపారాయణలు, సాయంత్రం 4గంటలకు కొండ దిగువన నవదంపతులకు వనవిహార మహోత్సవం. సాయంత్రం 5 గంటల నుంచి నూతన పెద్ద రథంపై స్వామి, అమ్మవార్ల ఊరేగింపు జరుగుతుంది.

23న : సుప్రభాతసేవ, శేషహోమాలు, కొట్నాలు, గౌరీపూజను ఉదయం 5గంటలకు నిర్వహిస్తారు. ఉదయం 9 గంటలకు పంపా సరోవరంలో చక్రస్నానం, సాయంత్రం 4 గంటలకు నీలలోహిత గౌరీపూజ, నాకబలి, దండియాడింపు, ధ్వజావరోహణ, కంకణ విమోచన ఉంటుంది.

24న: సుప్రభాతసేవ, చతుర్వేదపారాయణలు, రాత్రి 7.30కి కొండపై నిత్యకల్యాణమండపంలో శ్రీపుష్పయాగం. పేరంటాళ్లకు దంపతీతాంబూలాలు, రవిక వస్త్రాల వితరణ ఉంటుంది.



సత్యదేవుడి కల్యాణం నిర్వహించే వార్షిక కల్యాణ వేదిక... నూతన టేకు రథం





వాతావరణంలో మార్పులతో సముద్రతీరంలో శుక్రవారం సాయం సంధ్యవేళ ఆకాశం మేఘావృతమై బంగారు కాంతులతో కనువిందు చేసింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఎస్.రామేశ్వరం, ఓడలరేవు తీరాల్లో ఈ దృశ్యాలు కట్టిపడేశాయి. ముఖ్యంగా సముద్రంలో ఇంద్రధనస్సు ఆకట్టుకుంది. - అల్లవరం



ఆలమూరు మండలం మూలస్థానం వద్ద జాతీయ రహదారిపై ప్రమాద దృశ్యం.. నాగరాజు (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ఆలమూరు/ఆత్రేయపురం మే17: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మూలస్థానం అగ్రహారం వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన బర్రే నాగరాజు (25) మోటారు సైకిల్‌పై మూలస్థానం బయల్దేరాడు. ఇందిరాకాలనీ వైపు వెళ్లడానికి డివైడర్ దాటుతుండగా అదే సమయంలో రాజమహేంద్రవరం నుంచి రావులపాలెం వైపు వస్తున్న కారు వేగంగా ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు ఆలమూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ర్యాలి వెంకటేశ్వరనగర్‌కు చెందిన బర్రే సత్యనారాయణ-నాగమణి దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడైన సతీష్ ఏసీ మెకానిక్. అతడికి ఏడు నెలల కిందట మూల స్థానం అగ్రహారానికి చెందిన అమ్మాయితో వివాహమైంది. చిన్న కుమారుడైన నాగరాజు తాపీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అత్తవారింట్లో ఉన్న సతీష్ తమ్ముడికి ఫోను చేసి ఏసీ రిపేరింగ్‌కు సంబంధించి పార్టు తెమ్మన్నాడు. దానికి తీసుకుని బయల్దేరిన నాగరాజు మూలస్థానం వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో మృత్యువాతపడ్డాడు. దీంతో ర్యాలిలో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి. ప్రమాద వార్త తెలిసిన వెంటనే మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు దుఃఖ సాగరంలో మునిగిపోయారు.

కిడ్నాప్ కేసులో ఏడుగురి అరెస్టు

మలికిపురం, మే17: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రామరాజులంకలో ముందుగా ఓటువేసే విషయమై ఘర్షణ పడిన నేపథ్యంలో ఒక వ్యక్తిని ఏడుగురు కిడ్నాప్ చేశారు. మలికిపురం ఎస్ఐ సంపత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 13న ఎన్నికల్లో రామరాజులంకలో ఓటు వేసే విషయమై రేకపల్లి నాగరాజు, నార్ని పద్దయ్యలు ఘర్షణ పడ్డారు. ఒకరిపై ఒకరు చేయి చేసుకున్నారు. దీంతో పద్దయ్య మనుమడు, అతని స్నేహితులు కలసి అదే రోజు సాయంత్రం రేకపల్లి నాగరాజును కిడ్నాప్ చేశారు. నాగరాజు మర్నాడు తప్పించుకుని ఇంటికి చేరాడు. కాగా కిడ్నాప్‌కు వాడిన కారును, నార్ని వీర వెంకటశివప్రసాద్ (రామరాజులంక), ఇందుగుల గోపాలస్వామి(గూడపల్లి), కొంబత్తుల వికాస్ (కేశనపల్లి), ఇందుగుల సాయిగణేష్ (గూడపల్లి), కాపిశెట్టి వెంకటసత్యకృష్ణప్రసాద్ (నాని)(గూడపల్లి), తోరం దుర్గాకిరణ్ (గూడపల్లి), కటికిరెడ్డి దుర్గాశ్రీనివాస్ (గూడపల్లి)లు ఏడుగురినీ అరెస్టుచేసి కోర్టుకు పంపినట్టు మలికిపురం ఎస్ఐ తెలిపారు.


న్యూయోమ్ టెక్నాలజీస్ సీఈవోతో సమావేశమైన పద్మరాజు

న్యూయోమ్‌తో కలసి పనిచేయబోతున్నాం

నన్నయ ఉపకులపతి పద్మరాజు

దివాన్‌చెరువు, మే 17: భావితరం విద్యార్థుల అభ్యాస కార్యక్రమాలు, వివిధ అంశాల్లో ఆవిష్కరణల కోసం అత్యుత్తమ సెంటర్‌ను రూపొందించడంలో బెంగళూరులోని న్యూయోమ్ టెక్నాలజీస్ కంపెనీతో కలసి పనిచేయబోతున్నామని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె. పద్మరాజు తెలిపారు. న్యూయోమ్ వ్యవస్థాపకుడు, సీఈవో, ఎండీ డాక్టర్ వంగల రజనీకాంత్‌తో నన్నయ వర్సిటీ అధికారులు శుక్రవారం సమావేశమయ్యారు. వర్సిటీలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి న్యూయోమ్ సహకారంపై చర్చించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులకు అభ్యాసనా కార్యక్రమాలు, వ్యవస్థాపకత, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్‌లెర్నింగ్ వంటి అంశాల్లో ఆవిష్కరణలకోసం ఈ సెంటర్‌ను రూపొందించనున్నామన్నారు. విద్యార్థులకు సాధికారత కల్పించడం, విద్యార్థినులు, పారిశ్రామికవేత్తలపై కూడా దృష్టి సారిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్లేస్మెంట్ అధికారి బి.జగన్మోహనరెడ్డి, వర్సిటీ అధికారులు పాల్గొన్నారు.


ఎర్రచందనం దుంగలు సీలేరు నదిలో డంప్ చేసిన సన్నివేశం దృశ్యం

ముగిసిన పుష్ప2 సినిమా షూటింగ్

మోతుగూడెం, మే17: చింతూరు మండలం మోతుగూడెం లోయర్ సీలేరు ప్రాజెక్టులో మంగంపాడు, పాలగడ్డ, డొంకరాయి, పొల్లూరు పరిసర ప్రాంతాల్లో వారంరోజులుగా చిత్రీకరించిన పుష్ప2 సినిమా షూటింగ్ శుక్రవారం ముగిసింది. సీలేరు నదిలో దారాలమ్మ పిక్నిక్ స్పాట్ వద్ద కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. ఎర్రచందనం దుంగలు సీలేరు నదిలో డంప్ చేసిన కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. శుక్రవారం జరిగిన కొన్ని సన్నివేశ చిత్రీకరణలో స్థానికులకు అవకాశం లభించడంతో వారు ఆనందం వ్యక్తంచేశారు. స్థానికులు అధిక సంఖ్యలో షూటింగ్ ప్రదేశానికి తరలివచ్చారు.



విశేషాలంకరణలో శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి.. హాజరైన మహిళా భక్తులు

వైభవంగా భావనారాయణస్వామి కల్యాణోత్సవాలు

సర్పవరం జంక్షన్, మే 17: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే సుప్రసిద్ధ పురాతన పుణ్యక్షేత్రంగా పేరుగాంచిన సర్పవరం శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి సప్తాహ్నిక వార్షిక కల్యాణోత్సవాలు శుక్రవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ పురోహితులు స్వామివారికి సుప్రభాత సేవ, మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అర్చనలు, హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా పలు రకాల పుష్పాలతో విశేషాలంకరణ చేశారు. అనంతరం సాయంత్రం స్వామివారిని శేషవాహనంపై ఉంచి తిరువీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి సమర్పించిన గరుడ పొంగలి ప్రసాదాన్ని ధ్వజస్తంభం వద్ద మహిళా భక్తులు స్వీకరించారు. ముఖ్యంగా సంతానం లేని మహిళా భక్తులు గరుడ పొంగలి ప్రసాదాన్ని ధ్వజ స్తంభం వద్ద అత్యంత భక్తిశ్రద్ధలతో స్వీకరించారు. సంతానం లేనివారు గరుడ పొంగలిని స్వీకరిస్తే సంతానప్రాప్తి కలుగుతుందని భక్తుల నమ్మకం. శనివారం శేషవాహన సేవ కార్యక్రమం ఉంటుందని ఆలయ ఈవో జొన్నాడ భీమశంకరరావు తెలిపారు. కార్యక్రమంలో భారీగా భక్తులు పాల్గొన్నారు.

ఏపీఈఏపీసెట్‌కు కాకినాడ జిల్లాలో 1681 మంది విద్యార్థుల హాజరు

జేఎన్టీయూకే, మే17: కాకినాడ జిల్లాలోని 5 పరీక్షా కేంద్రాల్లో అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి సంబంధించి రెండో రోజు శుక్రవారం ఉదయం నిర్వహించిన పరీక్షకు 920 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 829 మంది హాజరయ్యారని, 91 మంది గైర్హాజరుకాగా 90.11 శాతం హాజరునమోదైనట్టు కన్వీనర్ కె.వెంకటరెడ్డి తెలిపారు. అదేవిధంగా మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 927 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 852 మంది హాజరయ్యారని, 75 మంది పరీక్ష రాయలేదని. మొత్తం 91.91 శాతం హాజరు నమోదైందన్నారు. మొత్తం రెండు సెషన్‌లకు కలిపి 1847 మంది పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 1681 మంది హాజరయ్యారని 166 మంది గైర్హాజరుకాగా మొత్తం 91.01 శాతం విదార్థులు హాజరు నమోదైనట్టు కన్వీనర్ తెలిపారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి పరీక్షలు ముగిశాయని, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన పరీక్షలు శనివారం ప్రారంభమై 23 వరకూ కొనసాగుతాయన్నారు.

ఖైదీలు పరివర్తన చెందాలి

సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ రాహుల్

రాజమహేంద్రవరం, మే17(ఆంధ్రజ్యోతి): ఖైదీలు చెడు వ్యసనాలను దూరం చేసుకొని సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకొనే విధంగా పరివర్తన చెందాలని సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ శ్రీరామ రాహుల్ పేర్కొన్నారు. సోషల్ ఇంక్యుబేషన్‌లో భాగంగా కేంద్ర కారాగారంలో ఖైదీల మానసిక పరివర్తనపై ఓ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఖైదీలకు ప్రభుత్వ మెడికల్ కళాశాలలోని సైక్రియాటిస్టులు డాక్టర్ రామారెడ్డి, డాక్టర్ నీలిమ మానసిక పరివర్తన చెందడంపై పలు సూచనలు చేశారు. చెడు స్నేహాలకు, మత్తుపదార్థాలకు బానిసలై మానసిక దౌర్బల్యంతో నేరాలకు పాల్పడ్డారని, అందువల్ల ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు మంచి చెడులను బేరీజు వేసుకొని మంచి నిర్ణయం తీసుకోవాలని చెప్పారు. ఈకార్యక్రమంలో డీఎస్ ఎం.రాజ్‌కుమార్, కారాగార వైద్యశాల వైద్యులు డాక్టర్ పి.కోమల, డాక్టర్ హారిక తదితరులు పాల్గొన్నారు.


రెయిలింగ్ తీసేసి ట్రాఫిక్ దిమ్మెలు ఏర్పాటుచేసిన దృశ్యం

ఆదమరిస్తే గోదాట్లోకే..

మరమ్మతుల పేరిట పలుసార్లు బ్రిడ్జి మూత.. చేసింది శూన్యం
ఇప్పుడు మరోసారి తంతు.. రోడ్‌కం రైల్ బ్రిడ్జి దుస్థితి ఇది



బ్రిడ్జి పక్కన ఇనుప గ్రిల్స్ ఎట్టకేలకు ఏర్పాటు చేస్తున్న దృశ్యాలు

ఈ ఫొటోల్లో కనిపిస్తున్నది చారిత్రాత్మక రాజమహేంద్రవరం రోడ్డుకం రైలు వంతెన. దీన్ని వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇష్టారాజ్య నిర్ణయాలతో సర్వనాశనం చేశారు. మరమ్మతుల పేరిట కొన్నిసార్లు, ప్రతిపక్ష పార్టీల యాత్రలను వంతెన మీదుగా వెళ్లకుండా చేయడానికి మరమ్మతులంటూ మరికొన్నిసార్లు పెద్ద తతంగమే నడిపారు. అంతం కాదిది ఆరంభం అన్న చందంగా బాగుచేసే పనులు అనేకసార్లు సాగించారు. ఆ క్రతువులో కమీషన్ల రూపంలో పెద్ద మొత్తంలో జేబుల్లో వేసుకున్నారనే విమర్శలు ఉండనే ఉన్నాయి. మరోవైపు మరమ్మతు పనుల కోసం నెలల తరబడి వంతెనపై ట్రాఫిక్ నిలిపివేసి జనాలను ఇబ్బందులకు గురిచేసినా చివరికి ఒరిగిందేమీ లేదు. వంతెన బాగుపడిందీ లేదు. పైగా మరింత ప్రమాదకరంగా తయారైంది. మరమ్మతుల కోసమంటూ ట్రాఫిక్ నిలిపివేసినా ప్రతిసారీ ధ్వంసమైన రెయిలింగ్‌లకు రంగులు వేయడం, బ్రిడ్జిపై తారురోడ్డు వేయడం వంటి వాటితో సరిపెట్టారు. అదేంటోగాని ప్రతిసారీ ప్రతిపక్షాల నేతలు ఈ వంతెనపై నుంచి వచ్చే సమయంలోనే మరమ్మతులకు తెరతీసేవారు. ఆ క్రమంలో అమరావతి రైతులనూ ఇబ్బందిపెట్టారు. ఇంతా చేసి వంతెన మరమ్మతులను మాత్రం ఈనాటికీ పూర్తిచేయలేకపోయారు. అక్కడక్కడా సిమెంటు రెయిలింగ్‌ని తీసేసి ఇనుప కమ్మెలతో రెయిలింగ్ ఏర్పాటుచేస్తున్నారు. భద్రత దృష్ట్యా ఈ పనులు అత్యంత వేగంగా జరగాల్సి ఉండగా అవి నత్తతో పోటీపడుతున్నాయి. ఇప్పుడు రెయిలింగ్ తీసేసిన చోట ఇదిగో ఇలా ట్రాఫిక్ సిమెంటు దిమ్మలను ఏర్పాటుచేశారు. దీంతో ఈ ప్రదేశం అత్యంత ప్రమాదకరంగా తయారైంది. అదుపు తప్పితే పాదచారులు సైతం గోదావరిలోకి పడిపోవాల్సిందే. కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడం అధికారుల అలసత్వాన్ని వెక్కిరిస్తోంది. రాజమహేంద్రవరానికి ఈ వంతెన ఆసియాలోనే ఒక ప్రత్యేక పేరును నిలిపితే.. అటు ప్రభుత్వం, ఇటు యంత్రాంగం తీవ్ర నిర్లక్ష్యం వహించడం పట్ల జనాలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

- రాజమహేంద్రవరం/ఆంధ్రజ్యోతి

తూర్పుగోదావరి
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

ఏజెన్సీ సమాచారం



ఐసీయూను ప్రారంభిస్తున్న ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే

ఏరియా ఆసుపత్రిలో ఐసీయూ ఏర్పాటు

ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం, మే17: స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ) సేవలను శుక్రవారం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ గిరిజన మారుమూల గ్రామాల్లో అత్యవసర సేవలు అందించేందుకు ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. రోడ్డు ప్రమాదాలు, విషం లేదా పాముకాటు, విషజ్వరాలు, డెంగ్యూ తదితర రోగులకు 24 గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టామన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ కె.లక్ష్మీ, వైద్యాధికారులు పాల్గొన్నారు.



మోతుగూడెంలో నిలిచిపోయిన విశాఖపట్నం- భద్రాచలం ఆర్టీసీ బస్సు

మొరాయించిన ఆర్టీసీ బస్సు

మోతుగూడెం, మే17: చింతూరు మండలం మోతుగూడెంలో శుక్రవారం తెల్లవారుజామున 5.30 గంటలకు విశాఖపట్నం-భద్రాచలం వెళ్లే ఆర్టీసీ బస్సు మోతుగూడెం అంబేడ్కర్ సెంటర్లో మొరాయించింది. దీంతో బస్సులో ఉన్న 31 మంది ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. వీరంతా భద్రాచలం వెళ్లాల్సి ఉందని వారు తెలిపారు. దీంతో కొంతమంది సీలేరు టు విజయవాడలోని ఆర్టీసీ బస్సులో వెళ్లారు. మొరాయించిన బస్సు క్లచ్ ప్లేట్లు పోయి ఆయిల్‌సీల్ కొట్టేసిందని బస్సు డ్రైవర్ తెలిపారు. ఈ ఘాటీలో ప్రయాణించే బస్సులు మెరుగైనవిగా ఉండాలని ప్రయాణికులు కోరుతున్నారు.



వైద్యాధికారులతో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీదేవి

'ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందించాలి'

రంపచోడవరం, మే 17: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన వైద్యం అందించాలని ఎంపీపీ బంధం శ్రీదేవి అన్నారు. శుక్రవారం ఆమె మండలంలోని వాడపల్లి, పెదగెద్దాడ, సీతపల్లి, నరసాపురం పీహెచ్‌సీలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పీహెచ్‌సీల్లో హెచ్‌డీఎస్ నిధుల నిర్వహణపై అధికారులను ప్రశ్నించారు. పీహెచ్‌సీల్లో హెచ్‌డీఎస్ బోర్డులు ఖాళీగా దర్శనమిస్తున్నాయని ఆరోపించారు. వైద్యాధికారులకు హెచ్‌డీఎస్ కమిటీపై ఉన్న శ్రద్ధ తేటతెల్లమవుతున్నదని అన్నారు. పీహెచ్‌సీలలో హెచ్‌డీసీ నిధులపై విచారణ జరిపించాలన్నారు. ఆమె వెంట ఎంపీటీసీలు బచ్చల మంగాయమ్మ, వంశీ కుంజం, సర్పంచ్ వడగల ప్రసాద్ ఉన్నారు.



వాలీబాల్ కిట్లు అందజేస్తున్న న్యాయవాది రవితేజ

వాలీబాల్ కిట్లు అందజేత

కూనవరం, మే17: మండలంలో అయ్యవారిగూడెంలో యువతకు వాలీబాల్ కిట్లను న్యాయవాది రవితేజ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడుదారుల వైపు వెళ్లకుండా ఉండడానికి, క్రీడలపై ఆసక్తి పెంచడానికి తాను వివిధ గ్రామాల్లో క్రీడాసామగ్రి అందజేస్తున్నట్లు తెలిపారు. యువత గ్రామస్థాయిలో తమ ప్రతిభ చాటుకుని రాష్ట్ర అంతర్జాతీయస్థాయికి ఎదగాలన్నారు. ముఖ్యంగా ఏజెన్సీలో గిరిజన యువతలో అత్యధిక ప్రతిభ ఉన్నప్పటికీ వారిని వెలికితీసే ప్రయత్నం జరగడం లేదన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వరరామచంద్రపురం,మే17: మండలంలో విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా అంతరాయమేర్పడనుంది. ఉదయం 7 గంటల నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఏఈ పరుశరామ్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆధ్యాత్మికంపై అవగాహనతో వ్యసనాలకు దూరం

ముగిసిన వేసవి బైబిల్ శిక్షణ తరగతులు



నల్లజర్ల, మే 17: మండలంలోని చీపురుగూడెం స్వసంపూర్ణ సువార్త ఆలయంలో పాస్టర్ ఎస్.విజయబాబు ఆధ్వర్యంలో చిన్నారులకు వేసవి బైబిల్ శిక్షణ తరగతులు నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగిన శిక్షణా తరగుతులు శుక్రవారం ముగిశాయి. చిన్నారుల్లో ఆధ్యాత్మిక, నైతిక విలువలు పెంపొందించేందుకు ఈ శిక్షణ శిబిరాలు ఎంతో ఉపయోగపడుతాయని విజయబాబు అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆధ్యాత్మికంపై అవగాహన కలిగిస్తే భవిష్యత్‌లో చెడు వ్యసనాలకు దూరంగా ఉంటారన్నారు. అనంతపల్లి నుంచి విచ్చేసిన జెస్సికా బృందం చిన్నారులకు బైబిల్ కథలు, వాక్యాలు, నృత్యాలు, పోటీలు నిర్వహించి ప్రతిభావంతులకు బహుమతులు అందించారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

నిడదవోలు, మే 17: రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందాడు. శుక్రవారం నిడదవోలు నుంచి విజ్జేశ్వరం వైపు బైక్‌పై వెళుతున్న కోడూరి లక్ష్మణరావు (57)ను ఎదురుగా వచ్చిన మరో బైక్ విజ్జేశ్వరం సమీపంలో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మణరావు సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. దీనిపై మృతుడి కుమారుడు సూర్యనారాయణశాస్త్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సమిశ్రగూడెం పోలీసులు తెలిపారు.

ఆదుకొనేదెవరు!

» గాలి దుమారంతో కూలిన అరటి తోటలు
» ఇప్పటికీ నష్ట వివరాలు నమోదు చేయని వైనం
» ఆదుకునే వారెవరంటూ రైతుల ఆవేదన



తీపర్రులో గాలి దుమారానికి విరిగిన అరటి తోట(ఫైల్)

పెరవలి, మే 17: ఎన్నికల ముందు గాలి దుమారంతో అరటి తోటలు విరిగిపడ్డాయి. నాయకులందరూ ఎవరి హడావిడిలో వారున్నారు. ఒక్కరు కూడా రైతులను పలకరించిన పాపాన పోలేదు. అధికారులు కూడా అంతంత మాత్రంగానే పర్యటించి నష్టం వివరాలు నమోదుచేశారు. ఇక తమను ఆదుకునేవారు ఎవరంటూ అరటి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు గంటల పాటు వీచిన ఈదురు గాలులుకు ఇటీవల జిల్లా వ్యాప్తంగా అనేక చోట్ల అరటిచెట్లు విరిగిపడ్డాయి. మండలంలో సుమారు 2వేల ఎకరాల్లో ఈనిక దశకు వచ్చిన అరటి చెట్లు విరిగిపోయాయి. అయితే వెళ్లిపోయే ప్రభుత్వం గాని, వచ్చే ప్రభుత్వం గాని ఎవరు తమను ఆదుకుంటారని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఎపుడో ఏడాది క్రితం జరిగిన నష్టానికే ఇప్పటికి దిక్కులేదని మళ్లీ ఇప్పుడు ఎకరానికి రూ.50,000 నుంచి రూ.70,000 వరకు నష్టపోయామని తమను ఆదుకునేవారు ఎవరంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు కనీసం తమ వివరాలను నమోదు చేయించడానికి కూడా ప్రజా ప్రతినిధులకు తీరిక లేకుండా పోయిందని వివరాలు నమోదయితే నష్టపరిహారం ఎపుడో ఒకపుడు వస్తుందనే ధీమా ఉంటుందని పలువురు రైతులు వాపోతున్నారు. ఈ విధంగా ఎన్నికలు తమ కొంప ముంచాయని వాపోతున్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న తాతారావు

» ప్రకృతి వ్యవసాయ శాఖ మేనేజర్ తాతారావు

దేవరపల్లి, మే 17: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ శాఖ మేనేజర్ తాతారావు అన్నారు. నియోజకవర్గంలోని దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాల ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో శుక్రవారం దేవరపల్లిలోని రైతు భరోసా కేంద్రం వద్ద సమావేశం నిర్వహించారు. తాతారావు మాట్లాడుతూ వచ్చే ఖరీఫ్ సీజన్‌కు అనుకూలంగా వర్షం కురిసిందని, రైతులు అందరితో నవధాన్యాలైన పచ్చిరొట్ట పంటలైన జొన్నలు, సజ్జలు, రాగులు, కొర్రలు, పెసర, మినుము, పిల్లిపెసర, జీలుగ, జనుము, బొబ్బర్లు, ఉలవలు, నువ్వులు, ఆవాలు, వేరుశనగ వంటి పంటలను రైతులు వేసే విధంగా సూచనలు ఇవ్వాలన్నారు. దీని వల్ల భూసారం పెంపొందుతుందన్నారు. పచ్చిరొట్ట పంట 45 రోజులు పెరిగిన తరువాత కలియదున్నటం ద్వారా భూసారం పెరుగుతుందన్నారు. రసాయనిక ఎరువుల విధానంతో భూసారం తగ్గిపోతుందని, సేంద్రీయ సాగుతో భూమి ఆరోగ్యం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ డివిజనల్ మాస్టర్ ట్రైనర్ శ్రీనివాసు, అడిషనల్ మేనేజర్ వల్లి, జూనియర్ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ వరలక్ష్మి, మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్, మూడు మండలాల సిబ్బంది పాల్గొన్నారు.

పెట్రోల్, డీజిల్ లూజు విక్రయాలపై నిఘా

జిల్లా జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్

రాజమహేంద్రవరం సిటీ, మే 17: జిల్లాలో పెట్రోల్, డీజిల్ లూజు విక్రయాలపై నిఘా ఉంచామని, ఎవరైనా నిబంధలనకు విరుద్ధంగా వ్యవహరిస్తే పెట్రోలియం చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్ తెలిపారు. ఏపీపీపీ(ఎల్అండ్ఆర్ఎస్) ఆర్డర్ 1980 యాక్ట్ ప్రకారం పెట్రోలియం రిటైల్ అవుట్‌లెట్‌ల కొనుగోలు, నిల్వ, విక్రయాలు మోటారు వాహనాలకు శాశ్వతంగా అమర్చిన ట్యాంక్‌కు కాకుండా ఇతర వాటికి లూజు ఇంధనాన్ని విక్రయించకూడదని ఆదేశించారు. ఏపీ పెట్రోలియం ఉత్పత్తులు(లైసెన్సింగ్, సరఫరాల నియంత్రణ) ఆర్డర్ 1980లోని సెక్షన్ 21 ప్రకారం చమురు కంపెనీ, డీలర్ కాకుండా ఇతర వ్యక్తులు కలిగి ఉండకూడదని, లైసెన్సింగ్ అథారిటీ అతనికి ఇచ్చిన అనుమతికి అనుగుణంగా పెట్రోలియం ఉత్పత్తుల యాజమాన్యం, స్వాధీనం లేదా నియంత్రణలో, ఈ పరిమితి మోటారు వాహనానికి శాశ్వతంగా అమర్చిన ట్యాంక్‌లోని పెట్రోలియంకు వర్తించదన్నారు. జిల్లాలోని పెట్రోలియం అవుట్ లెట్స్‌పై నిఘాను జిల్లాలోని సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలు, జిల్లా పౌరసరఫరాల అధికారులు, తహశీల్దార్లు వారి పరిధిలో ఉంచాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్సింగ్ అధికారికి నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

స్ట్రాంగ్‌రూమ్ పరిశీలన



స్ట్రాంగ్‌రూమ్‌లను సీసీ కెమెరాల్లో పరిశీలిస్తున్న రామకృష్ణారెడ్డి

దివాన్‌చెరువు, మే 17: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఈవీఎంలను భద్రపరి చిన స్ట్రాంగ్‌రూమ్‌ను అనపర్తి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శుక్రవారం పరిశీలించారు. విశ్వవి ద్యాలయంలోని బీఆర్ అంబేద్కర్ గ్రంథాలయం నుంచి సీసీ కెమెరాల ద్వారా స్ట్రాంగ్‌రూమ్‌ను ఆయన పరిశీలించారు. ఆయన వెంట కర్రి వెంకటరామారెడ్డి ఉన్నారు.

జూన్ 4న వైసీపీకి షాక్ తగలడం ఖాయం

» క్యాడర్‌ను కాపాడుకునేందుకు మేకపోతు గాంభీర్యం
» టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ



రాజమహేంద్రవరం సిటీ, మే17: వచ్చేనెల 4న రాష్ట్రంలో వైసీపీకి ప్రజలు షాక్ ఇవ్వడం ఖాయమని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల నాడిని తెలుసుకున్న సీఎం జగన్ నుంచి వైసీపీ నాయకులు వరకు మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూ వారి పార్టీ క్యాడర్ జారిపోకుండా ప్రయత్నిస్తున్నారన్నారు. లండన్ పర్యటనకు వెళ్తున్న జగన్ క్యాడర్‌లో నిరుత్సాహం కలగకుండా ఐప్యాక్ టీమ్‌తో సమావేశమయినప్పుడు చెప్పిన విషయాన్ని తమ ఓటమిని కప్పిపుచ్చుకోవడానికేనని అన్నారు. అసమర్థత, అవినీతి వైసీపీకి ప్రజలు ఎన్నికల్లో షాక్ ఇచ్చారని ఎక్కడ చూసినా కూటమి ప్రభావం కనిపించిందన్నారు. ఓటమికి కారణాలను చిత్తశుద్ధితో ఒప్పుకోకుండా వైసీపీ నాయకులు ముందుగా ఎన్నికల కమిషన్, పోలీసులపై నిందలు వేస్తున్నారని ధ్వజమెత్తారు. రాబోయే ఓటమిని తట్టుకోలేక దాడులతో పాటు వైసీపీ నేతలు అంబటి రాంబాబు, పేర్ని నాని, బొత్స సత్యనారాయణ వంటి నాయకులు ఎన్నికల కమిషన్ తమకు వ్యతిరేకంగా పనిచేస్తోందని వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలకు బటన్ నొక్కి ఐదునెలలు కావస్తున్నా లబ్ధిదారులకు రూ.14,165 కోట్లు జమ చేయాల్సి ఉండగా రూ.1982 కోట్లు మాత్రమే జమచేసిందన్నారు. అయితే ఈనెల 15న కాంట్రాక్టర్లకు రూ.1400 కోట్లు చెల్లించడం చూస్తే పేదల పట్ల జగన్‌రెడ్డికి ఉన్నది సవతి తల్లి ప్రేమే అన్నది స్పష్టంగా అర్థమైందన్నారు.

గరుడ వాహనంపై శ్రీవారి ఉత్సవం



దేవరపల్లిలో పురవీధుల్లో గరుడ వాహనసేవ

దేవరపల్లి, మే 17: దేవరపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా 3వ రోజు శుక్రవారం ఆలయం వద్ద ప్రత్యేక అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. ఉదయం శ్రీవారి మూ లమూర్తి స్థాపన, తిరుమంజనం, స్వామి వారి తిరువీధి ఉత్సవం, ధ్వజారో హణం, ఉత్సవమూర్తులకు అభిషేకం, మంగళశాసనం, అగ్ని ప్రతిష్ఠాపన, కుంభకళా ఆవాహనం, గరుడవాహన సేవ, కోలాట, భజన కార్యక్రమాలు ఘనంగా జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు వాసవీమాత జయంతి

కొవ్వూరు, మే 17: శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరిదేవి జయంతిని శనివారం నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మద్దుల సోమరాజు తెలిపారు. కొవ్వూరు బస్టాండ్ సమీపంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో శనివారం ఉదయం వాసవీమాతకు సహస్రనామ కుంకుమార్చన, క్షీరాభిషేకం, పంచామృతాభిషేకాలు నిర్వహిస్తామన్నారు. ఆర్యవైశ్య సంఘం, మహిళా సంఘం, వాసవిక్లబ్, వజ్రవనిత వాసవిక్లబ్ సభ్యులు పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో నాళం వి.వి. శ్రీనివాసరావు, తుమ్మలపల్లి నాగరమేష్, ఎంబీఎస్ ప్రసాద్, మద్దుల సత్యనారాయణ, కక్కిరాల సూరిబాబు పాల్గొన్నారు.

శ్రీరామనామ జ్ఞానయజ్ఞ సప్తాహాలు

కొవ్వూరు, మే 17: కొవ్వూరు బసివిరెడ్డి పేట ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 26 నుంచి జూన్ 2వరకు శ్రీరామనామ జ్ఞానయజ్ఞ సప్తాహాలు నిర్వహిస్తున్నట్టు హనుమాన్ భక్త బృందం తెలిపింది. హనుమాన్ జయంతి సందర్భంగా 26న కలశస్థాపన, రామనామ సంకీర్తన ప్రారంభం, 27న బిల్వార్చన, 28న నాగవల్లీ దళార్చన, 29న సిందూరార్చన, 30న అర్కపుష్పార్చన, 31న తులసీ దళార్చన, జూన్ 1న ఆంజనేయస్వామికి కదళీఫలార్చన, 2న శ్రీరామనామ సంకీర్తన సమాప్తి, సహస్ర ఘటాభిషేకం, అన్నసమారాధన జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ రమణమూర్తి



దొమ్మేరులో మొక్కలు నాటిన వ్యవసాయ కళాశాల విద్యార్థులు

కొవ్వూరు, మే 17: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ కేవీ రమణమూర్తి అన్నారు. జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్)లో భాగంగా దొమ్మేరు గ్రామంలో అచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, కళాశాలల ఆధ్వర్యంలో శుక్రవారం వన మహోత్సవం నిర్వహించారు. గ్రామంలోని ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో పలు రకాల మొక్కలు నాటారు. ఎన్ఎస్ఎస్ ప్రాముఖ్యత, సేవా కార్యక్రమాలను వివరించారు. ఎన్ఎస్ఎస్‌లో భాగంగా 7 రోజుల పాటు కార్యక్రమాలు చేపడుతున్నామని రమణమూర్తి చెప్పారు. కార్యక్రమంలో కేఎం దక్షిణామూర్తి, సీహెచ్. సునీత, ప్రొఫెసర్స్ ఎస్‌వీ భవానిప్రసాద్, టి.ఉషారాణి, కె.రవికుమార్, సర్పంచ్ తానేటికుమారి, సొసైటీ చైర్మన్ సూర్యనారాయణరాజు, కార్యదర్శి లక్ష్మి పాల్గొన్నారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువులు

కొవ్వూరు, మే 17: పచ్చిరొట్ట ఎరువులు వేసుకోవడం వల్ల భూమి సారవంతమై తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చునని కొవ్వూరు మండల వ్యవసాయాధికారి ఎ.గంగాధర్ తెలిపారు. 50శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువులు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. పచ్చిరొట్ట ఎరువు ల్లోని పోషకాలు, నత్రజని, భాసర్వం వల్ల భూమి సారవంతమవుతుందని, దీని వల్ల ఎరువుల వాడకం తగ్గించుకోవచ్చని చెప్పారు. జీలుగ, పిల్లి పెసర అందు బాటులో ఉన్నాయని, 50శాతం సబ్సిడీపై అందిస్తామని, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

వ్యాయామంతో రక్తపోటు నియంత్రణ

దొమ్మేరు పీహెచ్‌సీ వైద్యాధికారి ధర్మరాజు



ఉపాధి కూలీలకు రక్తపోటుపై అవగాహన కల్పిస్తున్న హెల్త్ సిబ్బంది

కొవ్వూరు, మే 17: ప్రతిరోజు వ్యాయామం చేయడం ద్వారా రక్తపోటును అదుపులో ఉంచుకోవచ్చునని దొమ్మేరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.ధర్మరాజు తెలిపారు. ఆరికిరేవుల గ్రామంలో శుక్రవారం ప్రపంచ రక్తపోటు వ్యతిరేక దినాన్ని నిర్వహించారు. ఉపాధి కూలీలకు రక్తపోటు నియంత్రణపై అవగాహన కల్పించారు. రక్తపోటుకు కారణాలు, లక్షణాలు, నియంత్రణకు తీసుకోవలిసిన జాగ్రత్తలను వివరించారు. ఐరన్ ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. మంచి ఆహారం, ఆలవాట్లు పరిశుభ్రమైన తాగునీరు తీసుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సత్యవతి, ఎంఎల్‌హెచ్‌పి సోని, ఏఎన్ఎం అరుణ, ఆనందకుమారి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నల్లజర్ల: నల్లజర్ల పీహెచ్‌సీలో డాక్టర్ తెల్లం గంగాధర్ బీపీపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. తలనొప్పి, తలతిరగడం, ఛాతినొప్పి, గుండె వేగంగా కొట్టుకోవడం, వికారం, వాంతులు, దృష్టి మసకబారడం, ఆందోళనగా ఉండడం, చెవుల్లో శబ్దాలు వంటివి బీపీ సూచనలన్నారు. హైబీపీని తక్కువగా అంచనా వేయకుడదని నిర్లక్ష్యంగా ఉంటే ఒక్కోసారి ప్రాణానికే ప్రమాదమని చెప్పారు. కార్యక్రమంలో జీవీవీ ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దేవరపల్లిలో అన్నసమారాధన

దేవరపల్లి, మే 17: దేవరపల్లిలో ఆదిశంకరాచార్యులు జయంతి వేడుకల్లో భాగంగా ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ముగింపు వేడుకల్లో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రేపు సత్యదేవుడి కల్యాణం

ఆత్రేయపురం, మే 17: మ ండలంలోని ర్యాలిలో శ్రీరమాసత్య నారాయణస్వామి దివ్య క ల్యాణోత్సవాలను ఈనెల 19 ను ంచి 24వ తేదీవరకు ఘనంగా నిర్వహించనున్నట్టు ఈవో కృష్ణచైతన్య తెలిపారు. ఆదివారం ఉదయం స్వామివారిని పెళ్లి కు మారుడిని చేసి సాయంత్రం ధ్వజారోహణం గావించి రాత్రి స్వామివారి కల్యాణం జరుపుతారు. 20న హోమం, ప్రత్యేక పూజలు, 21 సదస్యం, 22న హోమం, పూజలు, 23న పూర్ణాహుతి, చక్రస్నానం, 24న పుష్పోత్సవంతో కల్యాణోత్సవాలు ముగుస్తాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరానున్న దృష్ట్యా ఏర్పాట్లు చేస్తున్నట్టు ఈవో చెప్పారు.

డీఎల్ఎస్ఏ మోనిటరింగ్ కమిటీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా 9వ అదనపు జడ్జి మాధురి

రాజమహేంద్రవరం, మే 17(ఆంధ్రజ్యోతి): ప్యానల్, డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు, జిల్లా 9వ అదనపు న్యాయమూర్తి ఎం.మాధురి శుక్రవారం మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. వివిధ కేసుల్లో ఉచితంగా న్యాయ సహాయం అందజేయడానికి నియమించిన న్యాయవా దుల నుంచి ఆయా కేసుల పురోగతిపై సమీక్షించారు. ఆ కేసులు త్వరిత గతిన పరిష్కారం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎలాంటి సందేహాలు ఉన్నా డీఎల్ఎస్ఏకి తెలియజేయాలని సూచించారు. క్రిమినల్ కేసుల్లో బెయిల్ కోసం దాఖలు చేసిన అర్జీల గురించి చర్చించారు.

ఘనంగా బీవీఆర్ పుట్టినరోజు



బీవీఆర్‌ను సత్కరిస్తున్న టీడీపీ, జనసేన నాయకులు, అభిమానులు

రాజానగరం(కోరుకొండ), మే 17: టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర కార్యదర్శి బొడ్డు వెంకటరమణచౌదరి పుట్టినరోజును బూరుగుపూడిలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బత్తుల బలరామకృష్ణతో పాటు రాజానగరం, సీతానగరం, కోరుకొండ మండలాల్లోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో విచ్చేసి పూలమాలలు, పుష్పగుచ్ఛాలతో బీవీఆర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

రక్తపోటును నియంత్రించండి

రంగంపేట, మే 17: రక్తపోటును నియంత్రించండి, ఎక్కువ కాలం జీవించండి అని రంగంపేట పీహెచ్‌సీ డాక్టర్ కె.చిన్నారావు సూచించారు. శుక్రవారం ప్రపంచ హైపర్ టెన్షన్ డే సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక రక్తపోటు ఈ రోజుల్లో ఒక సాధారణ సమస్యగా మారిందని, 2017లో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం ప్రతి 8 మంది భారతీయుల్లో ఒకరు రక్తపోటుతో బాధపడుతున్నట్టు గుర్తించారన్నారు. హైపర్ టెన్షన్ గుండెపోటు పక్షవాతం వంటి ప్రమాదాలకు దారితీస్తుందన్నారు. హైపర్‌టెన్షన్‌పై ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో ఏటా మే 17న హైపర్‌టెన్షన్ డే జరుపుతున్నారన్నారు.

కాలినడకన వెంకన్న ఆలయానికి భక్తుడు



అనపర్తి, మే 17: అనపర్తి కూటమి అభ్యర్థిగా నల్లమిల్లి రామ కృష్ణారెడ్డి అభ్యర్థిత్వం ఖరారు కావాలని దుప్ప లపూడికి చెందిన ఎన్‌వీ యూత్ సభ్యుడు మేడపాటి సుధాకరరెడ్డి వాడపల్లి వెంకన్న ఆలయానికి కాలినడకన వస్తానని మొక్కుకున్నారు. సీటు లభించడం, ఎన్నికలు పూర్తి కావడంతో శుక్రవారం దుప్పలపూడి నుంచి వాడపల్లికి కాలినడకన బయలుదేరారు. ఈ సందర్భంగా సుధాకరరెడ్డికి టీడీపీ నాయకులు కుంత్సం కాశీవిశ్వేశ్వరరావు, నల్లమిల్లి వెంకటరెడ్డి తదితరులు వీడ్కోలు పలికారు.

రేపటి నుంచి వేణుగోపాలుడి కల్యాణోత్సవాలు

రాజమహేంద్రవరం కల్చరల్, మే 17: రాజమహేంద్రవరం గోదావరి గట్టున రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు ఈనెల 19నుంచి 24వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ కార్యనిర్వాహక అధికారి ఎన్ఎస్.పెద్దిరాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 19న స్వామివారి తిరువీధి ఉత్సవం, ధ్వజారోహణ, కల్యాణ మహోత్సవం, 20, 21 తేదీల్లో నిత్యహోమం బాలభోగం, బలిహరణ, 22న స్వామివారి రథోత్సవం, 23న చక్రతీర్థం, 24న ద్వాదశ ప్రదక్షిణలు, శ్రీపుష్ప యాగోత్సవం, జరుగుతాయని ఈవో పేర్కొన్నారు.

ఎల్ఐసీ చైర్మన్ క్లబ్ మెంబర్ గుండెపోటుతో మృతి




గోవిందరెడ్డి(ఫైల్)

అనపర్తి, మే 17: అనపర్తికి చెందిన ఎల్ఐసీ ఏజెంట్, చైర్మన్ క్లబ్ మెంబర్, మిలీనియం రౌండ్‌టేబుల్(ఎమ్‌డీఆర్‌టీ అమెరికా) కర్రి గోవిందరెడ్డి(68) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రామచంద్రపురం బ్రాంచిలో 48 ఏళ్లగా ఎల్ఐసీ ఏజెంటుగా సేవలందిస్తూ సంస్థ ద్వారా అనేక అవార్డులు, రివార్డులు పొందారు. ప్రజల్లో పొదుపు పట్ల అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాల ద్వారా గుర్తింపు పొందారు. అనపర్తి వర్తక సంఘం సంఘం కార్యదర్శిగా కూడా ఆయన సేవలందించారు. కాగా అనేక మంది ఏజెంట్లు అనపర్తి చేరుకుని గోవిందరెడ్డి పార్థీవదేహానికి నివాళులర్పించి కుటుంబానికి సానుభూతి తెలిపారు. పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తంచేశారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	ఆ ఒక్కటీ అడక్కు
సూర్యామినీ	కింగ్‌డమ్ ఆఫ్ ద ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్
సూర్యాప్యాలస్	అపరిచితుడు
స్వామి	కృష్ణమ్మ
శివజ్యోతి	గీతాంజలి మళ్లీ వచ్చింది
అనుశ్రీ(సాయికృష్ణ)	ది గ్యారీ ఫీల్డ్ మూవీ
రాజా	రత్నం
ఊర్వశి	బాక్
రంభ	మిరల్
మేనక	నటరత్నాలు, ప్రసన్నవదనం
అప్సర	కింగ్‌డమ్ ఆఫ్ ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్
కుమారి	దర్శిని, రత్నం
వీఎస్ మహాల్(నామవరం)	కృష్ణమ్మ
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	అపరిచితుడు
వెంకటసూర్య(కడియం)	ఆ ఒక్కటీ అడక్కు
సత్యగౌరి (అనపర్తి)	బాక్
సూర్యశ్రీ (అనపర్తి)	ఆ ఒక్కటీ అడక్కు
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	బాక్
రామకృష్ణ(కోరుకొండ)	
గీతాసినిమాస్ (సీతానగరం)	
శ్రీనివాస (గోకవరం)	కృష్ణమ్మ
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	కింగ్‌డమ్ ఆఫ్ ద ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్
లలితామహాల్(రంపచోడవరం)	ఆ ఒక్కటీ అడక్కు
నవయుగ(చింతూరు)	ఆ ఒక్కటీ అడక్కు





రాజమండ్రిలో శుక్రవారం వానలోనే వెళుతున్న వాహనదారులు

జిల్లాలో నాలుగు రోజులు వర్షాలు

రాజమహేంద్రవరం సిటీ, మే 17 : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతో పాటు పలు జిల్లాల్లో నాలుగు రోజుల పాటు తేలిక పాటి జల్లుల నుంచి మోస్తరు వర్షాలు పడతాయని రాష్ట్ర విపత్తుల సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ తెలి పారు.ఈ మేరకు జిల్లా కలెక్టరేట్ నుంచి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 18న శనివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలిక పాటి జల్లుల నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు.ఈ నెల 19న కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. 20న కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, ఏలూరు జిల్లాల్లో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. వర్షాలు పడే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పంట పొలాల్లో పనిచేసే రైతులు, వ్యవసాయ కూలీలు ,పశువులు కాపరులు చెట్ల కింద ,బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదని సూచించారు.

రాజమహేంద్రవరంలో చిరుజల్లులు

రాజమహేంద్రవరం సిటీ, మే 17: రాజమహేంద్రవరంలో చెదురుమదరు జల్లులతో కూడిన వాన పడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ముసురుపట్టి తుపర్లుగా వాన పడింది. మబ్బుగా ఉండడంతో భారీ వాన పడుతుందని ప్రజలు అనుకున్నారు. కానీ జల్లులుగానే వర్షం పడడంతో కాస్త సేద దీరారు. మార్కెట్‌కు వచ్చిన వారు త్వరగా పనులు ముగించుకుని చిన్న పాటి వానలో తడుస్తూనే ఇళ్ళకు చేరుకున్నారు. మొన్నటి వరకు 40 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతతో మండిపోయిన నగరం ముసురుపట్టి కురిసిన వానతో పూర్తిగా చల్లబడింది. ఆకాశం మబ్బుగా ఉన్నా.. ఉక్కబోత తగ్గకపోవడంతో కాస్త అలసటకు గురయ్యారు. గుడ్డిలో మెల్ల అన్నట్టు భానుడు ఉగ్రరూపం చూపకపోవడంతో జనం రోడ్లపైకి వచ్చారు..

బీపీని అదుపులో పెట్టండి
డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం రూరల్, మే 17 : రక్తపోటును అదుపులో పెట్టుకుంటే ఎక్కువ కాలం జీవించవచ్చని డీఎంహెచ్‌వో వెంకటేశ్వరావు అన్నారు. బొమ్మూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రపంచ రక్తపోటు దినంలో ఆయన మాట్లాడారు. మీ రక్తపోటును ఖచ్చితంగా కొలవండి, అదుపులో పెట్టండి, ఎక్కువ కాలం జీవించండి అన్న సందేశం ఇచ్చారు.జిల్లాలో వివిధ ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు రక్తపోటుపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. జిల్లా ఎపిడమిస్ట్ సుధీర్‌బాబు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 1,79,642 మందిని పరీక్షించామన్నారు. వారిలో 30 ఏళ్ల పైబడిన వారు 1,69,017 మంది ఉండగా 83 శాతం స్క్రీనింగ్ జరిగి 1,15,715 మందికి హైపర్ టెన్షన్ ఉన్నట్టు నిర్ధారించి 93,984 మందికి ఉచితంగా ట్రీట్‌మెంట్ ఇచ్చామన్నారు. ఈ నెల చివరిలో 3వ ఎన్‌సీడీ స్క్రీనింగ్ నిర్వహిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్‌సీడీ అధికారి డాక్టర్ హరిశ్చంద్రప్రసాద్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ మౌనిక, డాక్టర్ సత్యకుమార్ కుమార్ స్వామి, సూపర్‌వైజర్లు జాన్సన్ రాజు, రాజు, ఆలీబేగ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పారితోషికాల్లో వ్యత్యాసాల సవరణ

రాజమహేంద్రవరం సిటీ, మే 17 : సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వహించిన సిబ్బంది పారితోషికాల్లో వ్యత్యాసాలను సవరించారని ఏపీ ఎన్జీవో సంఘం నాయకులు తెలిపారు. పారితోషికాల్లో వ్యత్యాసాలపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ మాధవీలతకు వినతిపత్రంఅందజేశామన్నారు.దీనిపై స్పందించిన ఆమె సమస్య పరిష్కరించారని తెలిపారు.ఈ మేరకు ఏడు నియోజకవర్గాల ఆర్‌వోలకు సమస్య పరిష్కరించా లని ఆదేశాలు జారీ చేశారని సంఘ రాష్ట్ర కార్యదర్శి వేణు మాధవ్,నగర అధ్యక్ష కార్యదర్శులు సుబ్బారావు,నాయుడు,ప్రవీణ్‌కుమార్,ఉపాధ్యక్షుడు మాధవరావు తెలిపారు.

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సమీక్ష


రాజమహేంద్రవరం సిటీ, మే 17: నన్నయ వర్శిటీ పరిధిలో 144 సెక్షన్‌అమల్లో ఉందని.. కట్టుదిట్టమైన భద్రతలో ఈవీఎంలు ,వీవీ ప్యాట్‌లు ఉన్నాయని జిల్లా ఎన్నిల అధికారి, కలెక్టర్ డాక్టర్ కే మాధవీలత, జిల్లా ఎస్పీ జగదీష్ తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్‌మీనా శుక్రవారం జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈవీఎంలు ,వీవీ ప్యాట్స్‌ల సురక్షితంగా నిల్వచేసిన విధానాన్ని వివరించారు. ఈ సమీక్షలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్ తేజ్ భరత్, డీఆర్‌వో జి.నరసింహులు పాల్గొన్నారు.



అనధికార విద్యుత్ కనెక్షన్..
వైరు తగిలి వివాహిత మృతి

అనపర్తి, మే 17 : అక్రమంగా ఏర్పాటు చేసిన విద్యుత్ తీగ ఒక మహిళ ప్రాణాలను బలిగొంది. ఎస్ఐ రామారావు, స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం. అనపర్తి మండలం కుతుకులూరులో కూటేశ్వర కాలనీ వద్ద ఇటీవల ప్రైవేటు వ్యక్తులు బస్టాండ్ నిర్మాణం చేపట్టారు. బస్టాండ్‌కు సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ నుంచి అనధికారికంగా వైరు ఏర్పాటు చేసుకున్నారు. అయితే ఆ వైరు తెగి సమీపంలోని ఆలయం వద్ద గల ఇనుప పెన్సింగ్‌పై పడింది. ఆ కాలనీలో నివాసం ఉండే మేడవరపు రామతారకం (55) శుక్రవారం ఇంటి నుంచి చెత్త పారబోసేందుకు వచ్చి అనుకోకుండా ఇనుప పెన్సింగ్‌పై చేయి వేసింది. దీంతో విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కడే మృతిచెందింది. సమాచారం అందుకున్న ఎస్ఐ రామారావు సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబం నుంచి ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేశారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు. ఇదంతా గ్రామంలో విద్యుత్‌శాఖ సిబ్బందికి తెలిసే జరిగిందని బాధ్యులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

అంతా ఆయనే.. చేశారు!



అంతా నేనే.. కర్త కర్మ క్రియ అంతా నేనే.. ఇదీ జగన్ నియంతృత్వ ధోరణి.. ఓటు కూడా అభ్యర్థిని చూసి వేయరు.. నన్ను చూసి వేయాలి.. ఇదీ జగన్ మాట.. ఆ నియంతృత్వమే కొంప ముంచినట్టు సమాచారం.. ఎందుకంటే ప్రజలు గత ఐదేళ్లుగా అనుకుంటున్నది ఒక్కటే.. ఒక్క ఛాన్స్ అంటే.. ఎందుకు ఎన్నుకున్నాంరా బాబూ అని.. ఈ ఎన్నికల్లో ఓటుతో ఆ మాటను నిజం చేసినట్టు ఎక్కడ చూసినా చర్చ సాగుతోంది.. జగనే టార్గెట్‌గా ఎన్నికలు జరగడంతో కూటమికి వంద శాతం విజయం ఖాయమని ప్రజలు చెబుతున్నారు.. వైసీపీలోనూ ఈ మేరకు చర్చ సాగడం గమనార్హం.. అభ్యర్థులు కూడా జగన్‌ని టార్గెట్ చేసి అంతా మీరే చేశారనేందుకు సిద్ధమవుతున్నారు..

ఓడిపోతే..ఆ పాపం జగన్‌దే..

- లెక్కల తక్కెడలో వైసీపీ అభ్యర్థులు
- ఓటమి పాలవుతారనే చర్చ
- కారణాలకు టార్గెట్ జగన్
- కూటమికి సైలెంట్ వేవ్
- ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ
- జూన్ 4 కోసం ఎదురుచూపు
- అభ్యర్థుల్లో తీవ్ర టెన్షన్

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

అయ్యబాబోయ్ భరించలేకపోతున్నాం.. 2024 ఎన్నికలకు ముందు జగన్ పాలనపై చాలా మంది నోట వినిపించిన మాట ఇది.. ఆ మాటనే నిజం చేశారనేది నమ్మకం.. వైసీపీ అధినేత జగనే టార్గెట్.. చివరకు వైసీపీ వర్గాల్లోనూ ఇదే చర్చ సాగడం గమనార్హం. సీఎం జగన్ వైఖరి, ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాల వల్ల ప్రజలు విసిగిపోయినట్టు అర్థం అవుతుంది. అందుకే కసికసిగా ఓట్లేసినట్టు ఓటర్లు బహిరంగంగానే చెబుతున్నారు. జగన్ గ్రాఫ్ అట్టర్ ప్లాప్ అయినట్టు ప్రచారం జరుగుతోంది. వైసీపీకి కొంత మేర ఓటు బ్యాంక్ ఉండడం వాస్తవమే. కానీ వ్యతిరేకత ఈ ఓటు బ్యాంక్ కంటే చాలా రెట్లు పెరిగింది. దీంతో వైసీపీ అభ్యర్థులు సొంత వ్యూహాలు వేసుకున్నారు. సొంత మేనిఫెస్టోలు పెట్టుకుని ప్రచారం చేసుకున్నారు. కొన్ని చోట్ల జగన్ పేరు కూడా ఎత్తకుండా జాగ్రత్త పడ్డారు. స్థానికంగా కులాలు,వర్గాలుగా విభజించి ప్రజలను ప్రలోభాలకు గురి చేసి ఏదో విధంగా గట్టెక్కాలని చేసిన ప్రయత్నాలన్నీ విఫలమనే చర్చ సాగుతోంది.

అందరిదీ ఒకటే మాట..

జిల్లాలో ఒక లోక్‌సభ, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్రులు 83 మంది పోటీపడ్డారు. అయితే కూటమి అభ్యర్థులు.. వైసీపీ అభ్యర్థుల మధ్యే ప్రధానంగా పోటీ నెలకొంది.యువత, మహిళలు, వృద్ధులు సమాజంలోని అనేక వర్గాలు జగన్ పోవాలి అనే నినాదంతోనే ఓట్లు వేసినట్టు చర్చ సాగుతోంది. అభివృద్ధిని పూర్తిగా గాలికొదిలేసి.. సంక్షేమాన్ని మాత్రమే పట్టుకుని వేళాడడంతో లబ్ధిదారుల్లో జగన్ మీద నమ్మకం పోయినట్టు చెబుతున్నారు. శాంతిభద్రతలు లేకపోవడం, అవినీతి పెరగడం వంటివన్నీ వైసీపీ కొంప ముంచే పరిస్థితుల్లోకి నెట్టాయి. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ ముప్పు తెచ్చింది. సర్వే రాళ్లపై జగన్ పేరు రాయించుకోవడం,బొమ్మ వేయించుకోవడం, ఇళ్ల పట్టాలు, ప్రజల సొంత భూమి పట్టాల మీద కూడా జగన్ బొమ్మ వేయించుకోవడం పెద్ద సమస్యనే తెచ్చిపెట్టిందని చెప్పవచ్చు. దీనికి తోడు ఉద్యోగ వర్గాల్లో ఏ సీఎంకు లేనంత వ్యతిరేకత వచ్చింది. దీంతో పోస్టల్ బ్యాలెట్ 85 శాతం వరకూ కూటమికే పడినట్టు సమాచారం. అంతే కాకుండా వైసీపీ మేనిఫెస్టో చప్పగా ఉండడం, పింఛన్ల సొమ్ము 2028 నుంచి రూ.250 వంతున పెంచుతానని చెప్పడంతో జనం అసహనాన్ని పెంచింది. మరో పక్క కూటమి తరపున చంద్రబాబు, పవన్ మేనిఫెస్టో ప్రజల హృదయాల్లోకి చొచ్చుకుపోయింది. పింఛన్లు ఏప్రిల్ నుంచే నెలకు రూ.4 వేల వంతున పెంచుతాననడం కూడా ప్లస్ అయింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఎంత మంది పిల్లల ఉన్నా అందరికీ తల్లికి వందనం, బీసీ రిజర్వేషన్లు పెంచుతాననడం, బీసీ రక్షణ చట్టం వం టివి బాగా ఆలోచింప చేశాయి. ఈ నేపథ్యంలో ఓటరి చూపు కూటమిపై మళ్లింది.. అభివృద్ధి చేసే నాయకుడినే ఎన్నుకుందామని మళ్లీ ఓటరు బాబు వైపు చూడడం ఆరంభించారు. ఇది తెలిసిన వైసీపీ అభ్యర్థులు ఓట్లను పెంచుకోవడం కోసం తెగతంటాలు పడ్డారు.అనేక సొంత వ్యూహాలు రచించుకుని ప్రచారం చేశారు. అయితే జగన్ మీద ఉన్న వ్యతిరేకత వల్ల వారి ప్రయత్నాలు ఎంతవరకూ ఫలిస్తాయో చూడాలి మరి. గతంలో పార్టీ పేరు చెప్పి, ఓట్లు అడిగేవారు. ఈ సారి చాలా నియోజకవర్గాల్లో వైసీపీ అభ్యర్థులు తమ పేరే ఎక్కువగా చెప్పుకోవడం గమనార్హం. ఇలా ఈ సారి ఎన్నికలు కొత్త కోణాన్ని ఆవిష్కరించాయి.

జూన్ 4 వరకూ టెన్షన్

కౌంటింగ్‌కు మరో 20 రోజులు గడువు ఉంది. దీంతో అభ్యర్థుల్లో టెన్షన్ నెలకొంది. వివిధ రాజకీయ పార్టీలతో పాటు, టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిలో గెలుపు ధీమా వ్యక్తమవుతోంది. వారికి వచ్చిన సర్వే రిపోర్టులు, వారి సొంత అంచనాలు,నియోజకవర్గంలో పోలింగ్ బూత్‌లు, గ్రామాల వారీ కట్టిన లెక్కలు అన్నీ కూటమి గెలుపునే చూపిస్తున్నాయి. ఉద్యోగ, అధికార వర్గాల్లో కూటమి వైపే ఫలితాలు రానున్నట్టు ఒకటే చర్చ జరుగుతోంది.ఈ మేరకు పలువురు నాయకులు అభ్యర్థుల ఇళ్లకు వచ్చి అభినందనలు తెలుపుతున్నారు. కూటమికి చెందిన కొందరు రిలాక్స్ కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లడం గమనార్హం. వైసీపీ అభ్యర్థులు మాత్రం ప్రతి గ్రామంలోనూ ఎలా జరిగిందనే అంచనాలలో నిమగ్నమయ్యారు. ఇలా అందరూ జూన్ 4 కోసం ఎదురు చూస్తున్నారు. గెలుస్తామనే ధీమా వచ్చిన అభ్యర్థులు మెజార్టీ ఎంత అనే అంచనాలు వేస్తుంటే, టైట్‌గా ఉందని, ఓడిపోతామేమోననే భయం ఉన్న వారు ఏదో విధంగా కొన్ని ఓట్లు తమ కోటాలో వేసుకునే ప్రయత్నం చేస్తూ, బొటాబొటిగా గెలిచినా పర్వాలేదనే ఆలోచనతో ఉన్నారు.

జగన్ భయపడుతున్నాడు..



ఖాళీ అయిపోయే పార్టీని చూసి.. జగన్ రెడ్డి భయపడి లేనిది ఉన్నట్టుగా మాట్లాడుతున్నాడు.. అతను చెప్పేది పూర్తిగా సత్య దూరం.. ఏపీలో గెలిచేది కూటమే. గత ఐదేళ్లుగా ప్రజలు విసిగిపోయారు.జగన్ పాలనలో అన్నివర్గాలకు తీవ్ర అన్యాయం జరిగింది. ఓపికతో ఎన్నికలు ఎప్పుడు వస్తాయోనని ప్రజలు ఎదురుచూశారు. ఈ ఎన్నికల్లో కూటమిని సమర్థించారని.. విజయం మాదే. ఫలితాలు రావడమే తరువాయి. వైసీపీ కేడర్‌ను కాపాడుకోవడానికి జగన్ పచ్చి అబద్దాలు ఆడుతున్నాడు. తొందరెందుకు ప్రజలు తీర్పు జూన్ 4న వెలువడుతుంది.

- ఆదిరెడ్డి అప్పారావు, మాజీ ఎమ్మెల్సీ



ధనలక్ష్మిగా..వాసవీమాత

వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతోత్సవాల్లో భాగంగా ధవళేశ్వరం గ్రామంలో శుక్రవారం అమ్మవారిని రూ.6 లక్షల కరెన్సీ నోట్లతో ధనలక్ష్మిగా అలంకరించారు. ఈ మేరకు భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. శనివారం కన్యలతో పూజలు నిర్వహిస్తారన్నారు. - ధవళేశ్వరం

రాజానగరంలో ఏం జరిగింది!

బ్యాలెట్‌లో మొత్తంగా నలుగురు బత్తుల బలరామకృష్ణలు..



దివాన్‌చెరువు,/ రాజానగరం, మే 17 : ఓటమి పాలవుతామనే భయంతో వైసీపీ నాయకులు వేసిన ఎత్తులు అన్నీ ఇన్నీ కావు.. ఎన్నడూ లేనిది ఏకంగా ఒకే పేరుతో ఉన్న అభ్యర్థులను రంగంలోకి దించి ఓట్లు చీల్చాలనే కుయుక్తులకు తెరలేపారు. దీనికి రాజానగరం నియోజకవర్గం వేదికైంది.. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో రాజానగరం నియోజకవర్గం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఉమ్మడి అభ్యర్థిగా జనసేన తరపున బత్తుల బలరామకృష్ణ పోటీచేశారు.అయితే ఇదే పేరుతో ఇతర జిల్లాలకు చెందిన మరో ఇద్దరు అభ్యర్థులు అసెంబ్లీకి, ఒక అభ్యర్థి లోక్‌సభకు పోటీచేశారు.ఈ ముగ్గురిది మన జిల్లా కాదు.. ఎక్కడో రాయలసీమ తదితర ప్రాంతాల నుంచి తీసు కొచ్చినట్టు సమాచారం.ఈ ముగ్గురి పేర్లు బత్తుల బలరామకృష్ణే కావడం గమనార్హం. ఇలా రాజానగరం నియోజకవర్గం ఈవీఎం బ్యాలెట్‌లో నలుగురు బత్తులు బలరామకృష్ణలు పోటీపడ్డారు. అయితే కూటమి అభ్యర్థి బత్తులకు కేటాయించిన ఎన్నికల గుర్తు గాజుగ్లాసును పోలిన గుర్తులే మిగిలిన ఇద్దరు అభ్యర్థు లకు కేటాయించడం గమనార్హం. అంతే కాకుండా ఈ ముగ్గురు అభ్యర్థుల పేర్లు ఈవీఎంలలో వరుస క్రమంలో ఉండడంతో కొంత మంది ఓటర్లు అయోమయానికి గురైనట్టు సమాచారం.అయితే నియోజకవర్గంలో మాత్రం ఎవరికి అడిగినా గాజు గ్లాసుకే ఓటే శామని చెబుతున్నారు. ఓటింగ్‌లో జిల్లాలోనే రాజానగరం నియో జకవర్గం అగ్రస్థానంలో నిలిచింది.నియోజకవర్గంలో 2,16,491 మంది ఓటర్లకు 87.53 శాతం 1,89,505 మంది ఓటు హక్కు వినియో గించుకున్నారు. తాము చాలా ఎన్నికలు చూశామని..ఈ విధంగా ఓటర్లు ఓట్లు వేయడం అరుదు అని పలువురు విశ్లేష కులు అంటున్నారు. జూన్ నాల్గవ తేదీన వెలువడే ఫలితాల్లో తమ అభ్యర్థికే విజయం చేకూరుతుందన్న గట్టి విశ్వాసంతో కూటమి నేతలు ఉన్నారు.



ఆదమరిస్తే.. గోదాట్లోకే..

ఆదమరుపుగా ఉన్నామా గోదాట్లోకే.. ఎందుకంటే మన రాజమహేంద్రవరం - కొవ్వూరు మధ్యనే ఉన్న ఆసియాలోనే అతిపెద్ద రెండో రోడ్ కం రైలు బ్రిడ్జికి మళ్లీ మరమ్మతులు ఆరంభించారు.. ఏడాదిలో ఇప్పటికే ఏకంగా మూడు సార్లు మరమ్మతులు చేశారు..! ఒకసారైతే సుమారుగా 43 రోజులు రాకపోకలు నిలిపివేసి మరీ మరమ్మతులు చేశారు.. అయినా మళ్లీ మరమ్మతులు చేస్తూనే ఉన్నారు. వాహనదారులు మాత్రం ఇంకెంత కాలం మరమ్మతులు చేస్తారని అనుకుంటున్నారు. వైసీపీ పాలనలో నిధులొస్తే చేయడం లేదంటే వదిలేయడం షరా మామూలే కదా.. నిధులు విడుదలై ఉంటాయి.. మళ్లీ ఉభయ గోదావరులను కలిపే రోడ్ కం రైలు బ్రిడ్జి రెయిలింగ్‌లను మార్పు చేస్తున్నారు. ఈ పని ఎంత కాలం చేస్తారో చూడాల్సిందే మరి.. !

- వివరాలు 8లో

ప్రజలే ప్రభుత్వం కళ్లు తెరిపించాలి? 8
సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ఖైదీలు మారాలి
జైలు సూపరింటెండెంట్ రాహుల్

ఆదుకునేదెవరు!
అరటి రైతుల ఆందోళన 8

పట్టుకుంటారా.. వదిలేస్తారా!?



అక్రమాల దారి : శుక్రవారం ర్యాంపులోకి వెళ్లే బాటను తవ్వేసిన ఇసుక దొంగలు

- ఇసుక దొంగలపై అధికారుల శీతకన్ను
- తీపర్రు ర్యాంపులో గురువారం హడావుడి
- దొంగలను వదిలేసి..యంత్రాలు సీజ్
- శుక్రవారం గోదారి బాటనే తవ్వేసిన వైనం
- అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు

పెరవలి, మే 17: ఏంటో ఈ అధికారుల లీలా వినోదం.. జిల్లా కేంద్రంలో అధికారుల కళ్లెదుటే ఇసుక తవ్వేస్తున్నా ఎటువంటి దాడులూ లేవు..ఇప్పుడేమో హడావుడి చేస్తున్నారు. కళ్లెదుట రాజమహేంద్రవరంలో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు సాగుతున్నా కనిపించడంలేదు.. తీపర్రులో మాత్రం అధికారులు కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా హడావుడి చేస్తున్నారు. దొంగ అనుమతులు తెచ్చుకుని చాలా కాలంగా అక్రమ ఇసుక తవ్వకాలు జరిపి వందలాది కోట్లు దోచేసినా స్పందించని అధికారులు సుప్రీంకోర్టు మొట్టికాయలు వేయడంతో కదిలి వచ్చారు. అయితే తాము వస్తున్న సమాచారం లీక్ చేయడంతో ఇసుక దొంగలు తట్టా బుట్టా సర్దేసుకున్నారు. వచ్చిన అధికారులు అక్కడ ఎవరూ లేరంటూ కథలు అల్లారు. రెండు ఎక్స్‌కవేటర్లు, ఇసుక ఎగుమతికి వచ్చిన రెండు లారీలకు జరిమానా విధించి చేతులు దులుపుకున్నారు. వందల లారీలు ఇసుక, మట్టి తవ్వుకుపోయిన దొంగలు పారిపోయారని చెబుతున్నారు. పారిపోయిన దొంగలను పట్టుకుంటారో.. లేదో వేచి చూడాలి.

ఇసుక బాటకు గండి కొట్టిన దొంగలు..

ఇన్నాళ్ళుగా వందలాది లారీలు తోలుకుపోయిన ఇసుక బాటకు దొంగలు గండి కొట్టారు. గురువారం ఉదయం నుంచి రాత్రి ఒంటి గంట వరకు అధికారులు అక్కడే ఉన్నారు. తమకు నచ్చిన రీతిలో రిపోర్టులు రాసుకుని వెళ్లారు. అయితే అధికారులు ఇచ్చిన సూచనో.. దొంగలకు తట్టిన ఆలోచనో తెలియదు కాని ఇసుక ర్యాంప్ బాటకు గండి కొట్టి గోదావరిలోకి ఎవరూ వెళ్లే వీలు లేకుండా చేసేశారు. దీంతో పాటు గోదావరి బ్యారేజీల నుంచి ఎక్కువ మొత్తంలో నీరు వదిలేలా చేసి తాము ఇంత వరకు అక్రమంగా తవ్విన గోతులు నీటితో నిండిపోయేలా చేశారు. దీంతో ఇంత వరకు ఎంత ఇసుకను అక్రమంగా తరలించారు.. కొలతలు వేసి నిర్ధారించేందుకు అధికారులకు అవకాశం లేకుండా పోయింది. నిన్న, మొన్నటి వరకు చుక్కనీరు లేకుండా ఇసుక మాత్రమే కనిపిస్తే ఇపుడు గోదావరికి వరద వచ్చిన పరిస్థితిలా మొత్తం నీటితో నిండిపోయి ఆనవాలు లేకుండా మారిపోయింది. దీనికి కారణం అధికారులు నిర్లక్ష్య వైఖరి అని స్థానికులు విమర్శిస్తున్నారు. గతం నుంచి పత్రికల్లోనూ సామాజిక మాధ్యమాల్లోనూ టీవీలలోనూ ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకోవాలంటూ ఎంతగా మొత్తుకున్నా చెవికెక్కని అధికారులు ఏదో దొంగలను పట్టేదాం అన్నంత సీరియస్‌గా గురువారం ర్యాంప్‌లకు చేరుకున్నారు. అక్కడ కనీసం ఒక పుస్తకాన్ని గాని, ఒక వ్యక్తిని గాని అదుపులోకి తీసుకోలేకపోయారు. దీనిపై అయా శాఖల అధికారులపై విమర్శలు వస్తున్నాయి.



గుట్టలు..గుట్టేంటి : నిడదవోలు - నరసాపురం రోడ్డుకు చేర్చి ఉన్న ఇసుక

గోదావరిలో ఇసుక చోరీ జరిగింది..

గోదావరిలో ఇసుకను ఒక చోట గుట్టగా పెట్టారు. చోరీ జరిగిందని తెలిసినపుడు అధికారులు ఏం చేయాలి..ఆ ఇసుక గుట్టలను స్వాధీనం చేసుకుని ఎర్ర జెండాలు పాతాలి. కాని తీపర్రు, ఉసులుమర్రు మధ్యలో నిడదవోలు నరసాపురం రోడ్డుకు ఆనుకుని పెద్ద ఇసుక గుట్టలు ఉన్నాయి. ఇదంతా గోదావరిలో అక్రమంగా తవ్విన ఇసుక.. ప్రస్తుతం గోదావరి నుంచి తవ్వుతున్నందు వల్ల ఇసుకను రేపు గోదావరికి వరదలు వచ్చిన అనంతరం అమ్ముకుందామనే ఉద్దేశంతో అక్రమ తవ్వకం దారులు నిల్వ ఉంచారు. అయితే ఈ విధంగా దొరికిన దొంగ సొత్తును అధికారులు స్వాధీనం చేసుకోకుండా తిరిగి వెళ్లిపోవడం అనుమానాలకు తావిచ్చింది. రాత్రి సమయంలో ఆ ఇసుక గుట్టలను కూడా ఇసుక దొంగలు తరలించుకుపోయేలా అధికారులు సహకరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.అధికారులు వెంటనే స్పందించి ఇసుక గుట్టలు స్వాధీనం చేసుకుని అక్రమ ఎగుమతులు జరగకుండా అడ్డుకోవాలని పలువురు కోరుతున్నారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

న్యూయోమ్‌తో కలసి పనిచేయబోతున్నాం

నన్నయ ఉపకులపతి పద్మరాజు



న్యూయోమ్ టెక్నాలజీస్ సీఈవోతో సమావేశమైన వీసీ పద్మరాజు

దివాన్‌చెరువు, మే 17: తదుపరి తరం విద్యార్థుల అభ్యాస కార్యక్రమాలు, వివిధ అంశాల్లో ఆవిష్కరణల కోసం అత్యుత్తమ సెంటర్‌ను రూపొందించడంలో బెంగుళూరులోని న్యూయోమ్ టెక్నాలజీస్ కంపెనీతో కలసి పనిచేయబోతున్నామని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. న్యూయోమ్ వ్యవస్థాపకుడు, సీఈవో, ఎండీడాక్టర్ వంగల రజనీకాంత్‌తో నన్నయ వర్సిటీ అధికారులు శుక్రవారం సమావేశమయ్యారు. యూనివర్సిటీలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి న్యూయోమ్ సహకారంపై చర్చించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులకు అభ్యాసనా కార్యక్రమాలు, వ్యవస్థాపకత, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మిషన్‌లెర్నింగ్ వంటి అంశాల్లో ఆవిష్కరణల కోసం ఈ సెంటర్‌ను రూపొందించనున్నామన్నారు. విద్యార్థులకు సాధికారత కల్పించడం, విద్యార్థినులు, పారిశ్రామికవేత్తలపై కూడా దృష్టి సారిస్తున్నామన్నారు. గోదావరి జిల్లా వీసీగా రజనీకాంత్ ముందుకు వచ్చారని అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్లేస్మెంట్ అధికారి బి.జగన్మోహనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు వాసవీమాత జయంతి

కొవ్వూరు, మే 17: శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరిదేవి జయంతిని శనివారం నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మద్దుల సోమరాజు తెలిపారు. కొవ్వూరు బస్టాండ్ సమీపంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో శనివారం ఉదయం వాసవీమాతకు సహస్రనామ కుంకుమార్చన, క్షీరాభిషేకం, పంచామృతాభిషేకాలు నిర్వహిస్తామన్నారు. ఆర్యవైశ్య సంఘం, మహిళా సంఘం, వాసవి క్లబ్, వజ్రవనిత వాసవిక్లబ్ సభ్యులు పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో నాళం వి.వి. శ్రీనివాసరావు, తుమ్మలపల్లి నాగరమేష్, ఎంబీఎస్ ప్రసాద్, మద్దుల సత్యనారాయణ, కక్కిరాల సూరిబాబు పాల్గొన్నారు.

శ్రీరామనామ జ్ఞానయజ్ఞ సప్తాహాలు

కొవ్వూరు, మే 17: కొవ్వూరు బసివిరెడ్డి పేట ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 26 నుంచి జూన్ 2వరకు శ్రీరామనామ జ్ఞానయజ్ఞ సప్తాహాలు నిర్వహిస్తున్నట్లు హనుమాన్ భక్త బృందం తెలిపింది. హనుమాన్ జయంతి సందర్భంగా 26న కలశస్థాపన, రామనామ సంకీర్తన ప్రారంభం, 27న బిల్వార్చన, 28న నాగవల్లీ దళార్చన, 29న సింధూరార్చన, 30న అర్క పుష్పార్చన, 31న తులసీ దళార్చన, జూన్ 1న ఆంజనేయస్వామికి కదళీఫలార్చన, 2న శ్రీరామనామ సంకీర్తన సమాప్తి, సహస్ర ఘటాభిషేకం, అన్నసమారాధన జరుగుతుందన్నారు. భక్తులు అదిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ రమణమూర్తి



దొమ్మేరులో మొక్కలు నాటిన వ్యవసాయ కళాశాల విద్యార్థులు

కొవ్వూరు, మే 17: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ కేవీ రమణమూర్తి అన్నారు. జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్)లో భాగంగా దొమ్మేరు గ్రామంలో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, కళాశాలల ఆధ్వర్యంలో శుక్రవారం వన మహోత్సవం నిర్వహించారు. గ్రామంలోని ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో పలు రకాల మొక్కలు నాటారు. ఎన్ఎస్ఎస్ ప్రాముఖ్యత, సేవా కార్యక్రమాలను వివరించారు. ఎన్ఎస్ఎస్‌లో భాగంగా 7 రోజుల పాటు కార్యక్రమాలు చేపడుతున్నామని రమణమూర్తి చెప్పారు. కార్యక్రమంలో కేఎం దక్షిణామూర్తి, సీహెచ్. సునీత, ప్రొఫెసర్స్ ఎస్‌వీ భవానిప్రసాద్, టి.ఉషారాణి, కె.రవికుమార్, సర్పంచ్ తానేటికుమారి, సొసైటీ ఛైర్మన్ సూర్యనారాయణరాజు, కార్యదర్శి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామంతో నియంత్రణలో రక్తపోటు

దొమ్మేరు పీహెచ్‌సీ వైద్యాధికారి ధర్మరాజు

కొవ్వూరు, మే 17: ప్రతిరోజు వ్యాయామం చేయడం ద్వారా రక్తపోటును అదుపులో ఉంచుకోవచ్చునని దొమ్మేరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.ధర్మరాజు తెలిపారు. ఆరికిరేవుల గ్రామంలో శుక్రవారం ప్రపంచ రక్తపోటు వ్యతిరేక దినాన్ని నిర్వహించారు. ఉపాధి కూలీలకు రక్తపోటు నియంత్రణపై అవగాహన కల్పించారు. రక్తపోటుకు కారణాలు, లక్షణాలు, నియంత్రణకు తీసుకోవలిసిన జాగ్రత్తలను వివరించారు. ఐరన్ ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. మంచి ఆహారం, అలవాట్లు పరిశుభ్రమైన తాగునీరు తీసుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సత్యవతి, ఎంఎల్‌హెచ్‌పి సోని, ఏఎన్ఎం అరుణ, ఆనందకుమారి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నల్లజర్ల: నల్లజర్ల పీహెచ్‌సీలో డాక్టర్ తెల్లం గంగాధర్ బీపీపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. తలనొప్పి, తలతిరగడం, ఛాతినొప్పి, గుండె వేగంగా కొట్టుకోవడం, వికారం, వాంతులు, దృష్టి మసకబారడం, ఆందోళనగా ఉండడం, చెవుల్లో శబ్దాలు వంటివి బీపీ సూచనలన్నారు. హైబీపీని తక్కువగా అంచనా వేయకుడదని నిర్లక్ష్యంగా ఉంటే ఒక్కోసారి ప్రాణానికే ప్రమాదమని చెప్పారు. కార్యక్రమంలో జీవీవీ ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువులు

కొవ్వూరు, మే 17: పచ్చిరొట్ట ఎరువులు వేసుకోవడం వల్ల భూమి సారవంతమై తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చునని కొవ్వూరు మండల వ్యవసాయాధికారి ఎ.గంగాధర్ తెలిపారు. 50శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువులు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. పచ్చిరొట్ట ఎరువుల్లోని పోషకాలు, నత్రజని, భాసర్వం వల్ల భూమి సారవంతమవుతుందని, దీని వల్ల ఎరువుల వాడకం తగ్గించుకోవచ్చని చెప్పారు. జీలుగ, పిల్లి పెసర అందుబాటులో ఉన్నాయని, 50శాతం సబ్సిడీపై అందిస్తామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏవో సూచించారు.

గరుడ వాహనంపై శ్రీవారి ఉత్సవం



దేవరపల్లిలో పురవీధుల్లో గరుడ వాహనసేవ

దేవరపల్లి, మే 17: దేవరపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా 3వ రోజు శుక్రవారం ఆలయం వద్ద ప్రత్యేక అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. ఉదయం శ్రీవారి మూలమూర్తి స్థాపన, తిరుమంజనం, స్వామి వారి తిరువీధి ఉత్సవం, ధ్వజారోహణం, ఉత్సవమూర్తులకు అభిషేకం, మంగళశాసనం, అగ్ని ప్రతిష్ఠాపన, కుంభకళా ఆవాహనం, గరుడవాహన సేవ, కోలాట, భజన కార్యక్రమాలు ఘనంగా జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దేవరపల్లిలో అన్నసమారాధన

దేవరపల్లి, మే 17: దేవరపల్లిలో ఆదిశంకరాచార్యులు జయంతి వేడుకల్లో భాగంగా ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ముగింపు వేడుకల్లో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూమ్ పరిశీలన



దివాన్‌చెరువు, మే 17: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌ను అనపర్తి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శుక్రవారం పరిశీలించారు. విశ్వవిద్యాలయంలోని బీఆర్ అంబేడ్కర్ గ్రంథాలయం నుంచి సీసీ కెమెరాల ద్వారా స్ట్రాంగ్‌రూమ్‌ను ఆయన పరిశీలించారు. ఆయన వెంట కర్రి వెంకటరామారెడ్డి ఉన్నారు.

ఆదుకొనేదెవరు!

- గాలి దుమారంతో కూలిన అరటి తోటలు
- ఇప్పటికీ నష్టం వివరాలు నమోదు చేయని వైనం
- ఆదుకునే వారెవరంటూ రైతుల ఆవేదన



తీపర్రులో గాలి దుమారానికి విరిగిన అరటి తోట

పెరవలి, మే 17: ఎన్నికల ముందు గాలి దుమారంతో అరటి తోటలు విరిగిపడ్డాయి. నాయకులందరూ ఎవరి హడావిడిలో వారున్నారు. ఒక్కరు కూడా రైతులను పలకరించిన పాపాన పోలేదు. అధికారులు కూడా అంతంత మాత్రంగానే పర్యటించి నష్టం వివరాలు నమోదుచేశారు. ఇక తమను ఆదుకునేవారు ఎవరంటూ అరటి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు గంటల పాటు వీచిన ఈదురు గాలులుకు ఇటీవల జిల్లా వ్యాప్తంగా అనేక చోట్ల అరటిచెట్లు విరిగిపడ్డాయి. మండలంలో సుమారు 2వేల ఎకరాల్లో ఈనిక దశకు వచ్చిన అరటి చెట్లు విరిగిపోయాయి. అయితే వెళ్లిపోయే ప్రభుత్వం గాని, వచ్చే ప్రభుత్వం గాని ఎవరు తమను ఆదుకుంటారని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఎపుడో ఏడాది క్రితం జరిగిన నష్టానికే ఇప్పటికి దిక్కులేదని మళ్లీ ఇప్పుడు ఎకరానికి రూ.50,000 నుంచి రూ.70,000 వరకు నష్టపోయామని తమను ఆదుకునేవారు ఎవరంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు కనీసం తమ వివరాలను నమోదు చేయించడానికి కూడా ప్రజా ప్రతినిధులకు తీరిక లేకుండా పోయిందని వివరాలు నమోదయితే నష్టపరిహారం ఎపుడో ఒకపుడు వస్తుందనే ధీమా ఉంటుందని పలువురు రైతులు వాపోతున్నారు. ఈ విధంగా ఎన్నికలు తమ కొంప ముంచాయని వాపోతున్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

- ప్రకృతి వ్యవసాయ శాఖ మేనేజర్ తాతారావు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న తాతారావు

దేవరపల్లి, మే 17: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ శాఖ మేనేజర్ తాతారావు అన్నారు. నియోజకవర్గంలోని దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాల ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో శుక్రవారం దేవరపల్లిలోని రైతు భరోసా కేంద్రం వద్ద సమావేశం నిర్వహించారు. తాతారావు మాట్లాడుతూ వచ్చే ఖరీఫ్ సీజన్‌కు అనుకూలంగా వర్షం కురిసిందని, రైతులు అందరితో నవధాన్యాలైన పచ్చిరొట్ట పంటలైన జొన్నలు, సజ్జలు, రాగులు, కొర్రలు, పెసర, మినుము, పిల్లిపెసర, జీలుగ, జనుము, బొబ్బర్లు, ఉలవలు, నువ్వులు, ఆవాలు, వేరుశనగ వంటి పంటలను రైతులు వేసే విధంగా సూచనలు ఇవ్వాలన్నారు. దీని వల్ల భూసారం పెంపొందుతుంద న్నారు. పచ్చిరొట్ట పంట 45 రోజులు పెరిగిన తరువాత కలియదున్నటం ద్వారా భూసారం పెరుగుతుందన్నారు. రసాయనిక ఎరువుల విధానంతో భూసారం తగ్గిపోతుందని, సేంద్రీయ సాగుతో భూమి ఆరోగ్యం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ డివిజనల్ మాస్టర్ ట్రైనర్ శ్రీనివాసు, అడిషనల్ మేనేజర్ వల్లి, జూనియర్ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ వరలక్ష్మి, మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్, మూడు మండలాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులే ప్రభుత్వం కళ్లు తెరిపించాలి!

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న సీపీఐ కార్యదర్శి రామకృష్ణ

రాజానగరం, మే 17: అపరిష్కృత సమస్యల సాధన కోసం ఉపాధ్యాయులే ప్రభుత్వం కళ్లు తెరిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. గైట్ కళాశాలలో రెండ్రోజులపాటు జరిగే రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర స్థాయి ఉద్యమ శిక్షణా తరగతులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రామకృష్ణ ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై ప్రసంగించారు. మన రాష్ట్రంలో కులానికో కార్పొరేషన్ ఏర్పాటుచేసి పదవులు పం దారం చేసినా, ఆ పదవి పొందినవారు కారుకు పెద్ద బోర్డు తగిలించుకోవడం తప్ప ఎటువంటి ఉపయోగం లేదన్నారు. దీనిపై తాను ప్రశ్నించగా అలాగే అలా బోర్డు ఏర్పాటుచేస్తే టోల్‌గేట్ వద్ద టోల్ అడగరన్న సమాధానం వచ్చిందన్నారు. మోదీని ఇంటికి, వైసీపీని ఇడుపులపాయకు పంపాలన్నదే తమ నినాదమన్నారు. చంద్రబాబు సీఎం అయితే ఇంత దుర్మార్గంగా మాత్రం ఉండదని, ప్రజాస్వామ్యం ఫరిడవిల్లకపోవచ్చుగానీ ఆయన ఇంటికి వెళ్లి కనీసం ప్రశ్నించే అవకాశం అయినా ఉంటుందని ఒక ఉపాధ్యాయుడు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఎస్టీయూ రాష్ట్రాధ్యక్షుడు ఎల్.సాయి శ్రీనివాస్ విద్యారంగం తాజా పరిస్థితులపై మాట్లాడుతూ ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రధానోపాధ్యాయులను ఈవెంట్ మేనేజర్లుగా నైపుణ్యం ఇచ్చారంటూ చలోక్తి విసిరారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల దైనందిన కార్యక్రమం సెల్‌ఫోన్‌తోనే ప్రారంభమవుతోందన్నారు. విద్యానిలయాల్లో విద్యకు ప్రాధాన్యం లేకుండా అప్రధానమైన విషయాలకే ప్రాధాన్యమిస్తున్నారన్నారు. ప్రాథమిక పాఠశాలల్లోని కొన్ని తరగతులను విలీనం ద్వారా పల్లెబడులకు మంగళం పాడారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రఘునాధరెడ్డి, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు, ఉపాధ్యాయ వాణి ప్రధాన సంపాదకుడు జి.నాగేశ్వరరావు, సంఘ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శివప్రసాద్, ఉపాధ్యక్షుడు జాకబ్, ఆర్థిక కమిటీ సభ్యుడు ఈశ్వర రెడ్డి, తూర్పుగోదావరి, కాకినాడ, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డానియేల్‌బాబు, లక్ష్మణ, దొరబాబు, పల్లంరాజు, మోర్త శ్రీను, కాశీవిశ్వనాథ్, నాయకులు ఎస్‌జే త్రినాథ్‌బాబు, పి.సుబ్బరాజు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికంపై అవగాహనతో వ్యసనాలకు దూరం

ముగిసిన వేసవి బైబిల్ శిక్షణ తరగతులు



చీపురుగూడెంలో బైబిల్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

నల్లజర్ల, మే 17: మండలంలోని చీపురుగూడెం స్వసంపూర్ణ సువార్త ఆలయంలో పాస్టర్ ఎస్.విజయబాబు ఆధ్వర్యంలో చిన్నారులకు వేసవి బైబిల్ శిక్షణ తరగతులు నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగిన శిక్షణా తరగతులు శుక్రవారం ముగిశాయి. చిన్నారుల్లో ఆధ్యాత్మిక, నైతిక విలువలు పెంపొందించేందుకు ఈ శిక్షణ శిబిరాలు ఎంతో ఉపయోగపడుతాయని విజయబాబు అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆధ్యాత్మికంపై అవగాహన కలిగిస్తే భవిష్యత్‌లో చెడు వ్యసనాలకు దూరంగా ఉంటారన్నారు. అనంతపల్లి నుంచి విచ్చేసిన జెస్సికా బృందం చిన్నారులకు బైబిల్ కథలు, వాక్యాలు, నృత్యాలు, పోటీలు నిర్వహించి ప్రతిభావంతులకు బహుమతులు అందించారు.

ఖైదీలు పరివర్తన చెందాలి

సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ రాహుల్

రాజమహేంద్రవరం, మే 17(ఆంధ్రజ్యోతి): ఖైదీలు చెడు వ్యసనాలను దూరం చేసుకొని సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకొనే విధంగా పరివర్తన చెందాలని సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ శ్రీరామ రాహుల్ పేర్కొన్నారు. సోషల్ ఇంక్యుబేషన్‌లో భాగంగా కేంద్ర కారాగారంలో ఖైదీల మానసిక పరివర్తనపై ఓ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఖైదీలకు ప్రభుత్వ మెడికల్ కళాశాలలోని సైక్రియాటిస్టులు డాక్టర్ రామారెడ్డి, డాక్టర్ నీలిమ మానసిక పరివర్తన చెందడంపై పలు సూచనలు చేశారు. చెడు స్నేహాలకు, మత్తు పదార్థాలకు బానిసలై మానసిక దౌర్బల్యంతో నేరాలకు పాల్పడ్డారని, అందువల్ల ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు మంచి చెడులను బేరీజు వేసుకొని మంచి నిర్ణయం తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో డీఎస్ ఎం.రాజ్‌కుమార్, కారాగార వైద్యశాల వైద్యులు డాక్టర్ పి.కోమల, డాక్టర్ హారిక తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

విజ్జేశ్వరం సమీపంలో ఘటన.. కేసు నమోదు

నిడదవోలు, మే 17: రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందాడు. శుక్రవారం నిడదవోలు నుంచి విజ్జేశ్వరం వైపు బైక్‌పై వెళుతున్న కోడూరి లక్ష్మణరావు (57)ను ఎదురుగా వచ్చిన మరో బైక్ విజ్జేశ్వరం సమీపంలో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మణరావు సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. దీనిపై మృతుడి కుమారుడు సూర్యనారాయణశాస్త్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సమిశ్రగూడెం పోలీసులు తెలిపారు.

డీఎల్ఎస్ఏ మానిటరింగ్ కమిటీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా 9వ అదనపు జడ్జి మాధురి

రాజమహేంద్రవరం, మే 17(ఆంధ్రజ్యోతి): ప్యానల్, డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు, జిల్లా 9వ అదనపు న్యాయమూర్తి ఎం.మాధురి శుక్రవారం మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. వివిధ కేసుల్లో ఉచితంగా న్యాయ సహాయం అందజేయడానికి నియమించిన న్యాయవా దుల నుంచి ఆయా కేసుల పురోగతిపై సమీక్షించారు. ఆ కేసులు త్వరిత గతిన పరిష్కారం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎలాంటి సందేహాలు ఉన్నా డీఎల్ఎస్ఏకి తెలియజేయాలని సూచించారు. క్రిమినల్ కేసుల్లో బెయిల్ కోసం దాఖలు చేసిన అర్జీల గురించి చర్చించారు.

ఘనంగా బీవీఆర్ పుట్టినరోజు



బీవీఆర్‌ను సత్కరిస్తున్న టీడీపీ, జనసేన నాయకులు, అభిమానులు

రాజానగరం(కోరుకొండ), మే 17: టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర కార్యదర్శి బొడ్డు వెంకటరమణచౌదరి పుట్టినరోజును బూరుగుపూడిలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బత్తుల బలరామకృష్ణతో పాటు రాజానగరం, సీతానగరం, కోరుకొండ మండలాల్లోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో విచ్చేసి పూలమాలలు, పుష్పగుచ్ఛాలతో బీవీఆర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

రక్తపోటును నియంత్రించండి

రంగంపేట, మే 17: రక్తపోటును నియంత్రించండి, ఎక్కువ కాలం జీవించండి అని రంగంపేట పీహెచ్‌సీ డాక్టర్ కె.చిన్నారావు సూచించారు. శుక్రవారం ప్రపంచ హైపర్ టెన్షన్ డే సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక రక్తపోటు ఈ రోజుల్లో ఒక సాధారణ సమస్యగా మారిందని, 2017లో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం ప్రతి 8 మంది భారతీయుల్లో ఒకరు రక్తపోటుతో బాధపడుతున్నట్టు గుర్తించారన్నారు. హైపర్ టెన్షన్ గుండెపోటు పక్షవాతం వంటి ప్రమాదాలకు దారితీస్తుందన్నారు. హైపర్‌టెన్షన్‌పై ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో ఏటా మే 17న హైపర్‌టెన్షన్ డే జరుపుతున్నారన్నారు.

కాలినడకన వెంకన్న ఆలయానికి భక్తుడు



అనపర్తి, మే 17: అనపర్తి కూటమి అభ్యర్థిగా నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అభ్యర్థిత్వం ఖరారు కావాలని దుప్పలపూడికి చెందిన ఎన్‌వీ యూత్ సభ్యుడు మేడపాటి సుధాకరరెడ్డి వాడపల్లి వెంకన్న ఆలయానికి కాలినడకన వస్తానని మొక్కుకున్నారు. సీటు లభించడం, ఎన్నికలు పూర్తి కావడంతో శుక్రవారం దుప్పలపూడి నుంచి వాడపల్లికి కాలినడకన బయలుదేరారు. ఈ సందర్భంగా సుధాకరరెడ్డికి టీడీపీ నాయకులు కుంత్సం కాశీవిశ్వేశ్వరరావు, నల్లమిల్లి వెంకటరెడ్డి తదితరులు వీడ్కోలు పలికారు.

రేపటి నుంచి వేణుగోపాలుడి కల్యాణోత్సవాలు

రాజమహేంద్రవరం కల్చరల్, మే 17: రాజమహేంద్రవరం గోదావరి గట్టున రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు ఈనెల 19నుంచి 24వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ కార్యనిర్వాహక అధికారి ఎన్ఎస్.పెద్దిరాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 19న స్వామివారి తిరువీధి ఉత్సవం, ధ్వజారోహణ, కల్యాణ మహోత్సవం, 20, 21 తేదీల్లో నిత్యహోమం బాలభోగం, బలిహరణ, 22న స్వామివారి రథోత్సవం, 23న చక్రతీర్థం, 24న ద్వాదశ ప్రదక్షిణలు, శ్రీపుష్ప యాగోత్సవం, జరుగుతాయని ఈవో పేర్కొన్నారు.

ఎల్ఐసీ చైర్మన్ క్లబ్ మెంబర్ గుండెపోటుతో మృతి



గోవిందరెడ్డి(ఫైల్)

అనపర్తి, మే 17: అనపర్తికి చెందిన ఎల్ఐసీ ఏజెంట్, చైర్మన్ క్లబ్ మెంబర్, మిలీనియం రౌండ్‌టేబుల్(ఎమ్‌డీఆర్‌టీ అమెరికా) కర్రి గోవిందరెడ్డి(68) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రామచంద్రపురం బ్రాంచిలో 48 ఏళ్లుగా ఎల్ఐసీ ఏజెంటుగా సేవలందిస్తూ సంస్థ ద్వారా అనేక అవార్డులు, రివార్డులు పొందారు. ప్రజల్లో పొదుపు పట్ల అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాల ద్వారా గుర్తింపు పొందారు. అనపర్తి వర్తక సంఘం సంఘం కార్యదర్శిగా కూడా ఆయన సేవలందించారు. కాగా అనేక మంది ఏజెంట్లు అనపర్తి చేరుకుని గోవిందరెడ్డి పార్థీవదేహానికి నివాళులర్పించి కుటుంబానికి సానుభూతి తెలిపారు. పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తంచేశారు.

ఆదమరిస్తే గోదాట్లోకే..

మరమ్మతుల పేరిట తతంగం.. చేసింది శూన్యం

ఇప్పుడు మరోసారి తంతు.. రోడ్‌కం రైల్ బ్రిడ్జి దుస్థితి ఇది

రెయిలింగ్ తీసేసి ట్రాఫిక్ దిమ్మెలు ఏర్పాటుచేసిన దృశ్యం







బ్రిడ్జి పక్కన ఇనుప గ్రిల్స్ ఎట్టకేలకు ఏర్పాటు చేస్తున్న దృశ్యాలు

ఈ ఫొటోల్లో కనిపిస్తున్నది చారిత్రాత్మక రాజమహేంద్రవరం రోడ్డు కం రైలు వంతెన. దీన్ని వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇష్టారాజ్య నిర్ణయాలతో సర్వనాశనం చేశారు. మరమ్మతుల పేరిట కొన్నిసార్లు, ప్రతిపక్ష పార్టీల యాత్రలను వంతెన మీదుగా వెళ్లకుండా చేయడానికి మరమ్మతులంటూ మరికొన్నిసార్లు పెద్ద తతంగమే నడిపారు. అంతం కాదిది ఆరంభం అన్న చందంగా బాగుచేసే పనులు అనేకసార్లు సాగించారు. ఆ క్రతువులో కమీషన్ల రూపంలో పెద్ద మొత్తంలో జేబుల్లో వేసుకున్నారనే విమర్శలు ఉండనే ఉన్నాయి. మరోవైపు మరమ్మతు పనుల కోసం నెలల తరబడి వంతెనపై ట్రాఫిక్ నిలిపివేసి జనాలను ఇబ్బందులకు గురిచేసినా చివరికి ఒరిగిందేమీ లేదు. వంతెన బాగుపడిందీ లేదు. పైగా మరింత ప్రమాదకరంగా తయారైంది. మరమ్మతుల కోసమంటూ ట్రాఫిక్ నిలిపివేసినా ప్రతిసారీ ధ్వంసమైన రెయిలింగ్‌లకు రంగులు వేయడం, బ్రిడ్జిపై తారురోడ్డు వేయడం వంటి వాటితో సరిపెట్టారు. అదేంటోగాని ప్రతిసారీ ప్రతిపక్షాల నేతలు ఈ వంతెనపై నుంచి వచ్చే సమయంలోనే మరమ్మతులకు తెరతీసేవారు. ఆ క్రమంలో అమరావతి రైతులనూ ఇబ్బందిపెట్టారు. ఇంతా చేసి వంతెన మరమ్మతులను మాత్రం ఈనాటికీ పూర్తిచేయలేకపోయారు. అక్కడక్కడా సిమెంటు రెయిలింగ్‌ని తీసేసి ఇనుప కమ్మెలతో రెయిలింగ్ ఏర్పాటుచేస్తున్నారు. భద్రత దృష్ట్యా ఈ పనులు అత్యంత వేగంగా జరగాల్సి ఉండగా అవి నత్తతో పోటీపడుతున్నాయి. ఇప్పుడు రెయిలింగ్ తీసేసిన చోట ఇదిగో ఇలా ట్రాఫిక్ సిమెంటు దిమ్మలను ఏర్పాటుచేశారు. దీంతో ఈ ప్రదేశం అత్యంత ప్రమాదకరంగా తయారైంది. అదుపు తప్పితే పాదచారులు సైతం గోదావరిలోకి పడిపోవాల్సిందే. కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడం అధికారుల అలసత్వాన్ని వెక్కిరిస్తోంది. రాజమహేంద్రవరానికి ఈ వంతెన ఆసియాలోనే ఒక ప్రత్యేక పేరును నిలిపితే.. అటు ప్రభుత్వం, ఇటు యంత్రాంగం తీవ్ర నిర్లక్ష్యం వహించడం పట్ల జనాలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

- రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి)

'4న వైసీపీకి షాక్ తగలడం ఖాయం'

రాజమహేంద్రవరం సిటీ, మే 17: వచ్చేనెల 4న రాష్ట్రంలో వైసీపీకి ప్రజలు షాక్ ఇవ్వడం ఖాయమని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల నాడిని తెలుసుకున్న సీఎం జగన్ నుంచి వైసీపీ నాయకులు వరకు మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూ వారి పార్టీ క్యాడర్ జారిపోకుండా ప్రయత్నిస్తున్నారన్నారు. లండన్ పర్యటనకు వెళ్తున్న జగన్ క్యాడర్‌లో నిరుత్సాహం కలగకుండా ఐప్యాక్ టీమ్‌తో సమావేశమయినప్పుడు చెప్పిన విషయాన్ని తమ ఓటమిని కప్పిపుచ్చుకోవడానికేనని అన్నారు. అసమర్థత, అవినీతి వైసీపీకి ప్రజలు ఎన్నికల్లో షాక్ ఇచ్చారని ఎక్కడ చూసినా కూటమి ప్రభావం కనిపించిందన్నారు. ఓటమికి కారణాలను చిత్తశుద్ధితో ఒప్పుకోకుండా వైసీపీ నాయకులు ముందుగా ఎన్నికల కమిషన్, పోలీసులపై నిందలు వేస్తున్నారని ధ్వజమెత్తారు. రాబోయే ఓటమిని తట్టుకోలేక దాడులతో పాటు వైసీపీ నేతలు అంబటి రాంబాబు, పేర్ని నాని, బొత్స సత్యనారాయణ వంటి నాయకులు ఎన్నికల కమిషన్ తమకు వ్యతిరేకంగా పనిచేస్తోందని వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని గన్ని కృష్ణ అన్నారు.